# దేవుడు చేయు శిక్షను సంతోషముతో అంగీకరించడం

## (2 సమూ. 15-20)

హెబ్రీ. 12 దేవుడు చేయు శిక్ష అనే అంశాన్ని గూర్చి మాట్లాడుతుంది. అది మనకు అంత సౌఖ్యంగా ఉండదు.

ఎవరికి హెబ్రీయులకు రాసిన పత్రిక పంపబడిందో వారు నిరాశ చెందినవారై మానుకోడానికి సిద్ధంగా ఉన్నారు. (అలా సిద్ధంగా ఉన్నవారికి ఆ పత్రిక పంపబడింది). అందులో వారు మరచిపోయిన ఒక సంగతిని గూర్చి రచయిత వారికి జ్ఞాపకం చేస్తున్నాడు:

> మీకు కుమారులుగా కావించబడిన హెచ్చరికలను మీరు మరచిపోతిరా,
>
> నా కుమారుడా, **ప్రభువు** చేయు శిక్షను తృణీకరించకుము
> ఆయన నిన్ను గద్దించినప్పుడు విసుకకుము
> **ప్రభువు తాను ప్రేమించువానిని శిక్షించి** తాను
> స్వీకరించు ప్రతి కుమారుని దండించును.

> ... శిక్షాఫలము పొందుటకై మీరు సహించుచున్నారు; దేవుడు కుమారులనుగా మిమ్మును చూచుచున్నాడు. తండ్రి శిక్షింపని కుమారుడెవడు? కుమాళ్లయినవారందరు శిక్షలో పాలుపొందుచున్నారు, మీరు పొందనియెడల దుర్బీజులేగాని కుమారులు కారు. మరియు శరీర సంబంధులైన తండ్రులు మనకు శిక్షకులై యుండిరి. వారియందు భయభక్తులు కలిగియుంటిమి; అట్లయితే ఆత్మలకు తండ్రియైన వానికి మరి యెక్కువగా లోబడి బ్రదుకవలెనుగదా? వారు కొన్ని దినములమట్టుకు తమ కిష్టము వచ్చినట్టు మనలను శిక్షించిరిగాని మనము తన పరిశుద్ధతలో పాలుపొందవలెనని మన మేలుకొరకే ఆయన శిక్షించుచున్నాడు. మరియు ప్రస్తుతమందు సమస్తశిక్షయు దుఃఖకరముగా కనబడునేగాని సంతోషకరముగా కనబడదు. అయినను దానియందు అభ్యాసము కలిగినవారికి అది నీతియను సమాధానకరమైన ఫలమిచ్చును (12:5-11; ఒత్తి పలకడం నాది).

మన మార్గంలో సమస్యలు ఎందుకు వస్తాయో ఎల్లవేళలా మనం గ్రహించలేం. కాని కష్టకాలం వచ్చినప్పుడు, వాటిని మనం సంతోషంతో అంగీకరించాలని హెబ్రీ. 12 బోధిస్తుంది. "ఆత్మలకు తండ్రియైన వానికి మరి యెక్కువగా లోబడి బ్రదుకవలెను గదా?" (9 వ.). మన హృదయాలు ఆయన హృదయానికి అనుకూలపరచాలి. అలా మనం చేసినట్టయితే, చివరిలో, మనం ఎక్కువ భక్తిగలవారమైయుంటాం. అంతంలో, వేరే ఏ మార్గంలో ఎరుగలేనంతగా, సమాధానమైన మనస్సు కలిగియుంటాం. "నీతియను సమాధానకరమైన ఫలం" (11 వ.) మన జీవితాల్లో ఎదిగి పంట పండుతుంది.

దావీదు జీవితంలో "దేవుడు చేయు శిక్షను సంతోషముతో అంగీకరించడం" అనే

చర్చనీయాంశాన్ని ఈ పాఠంలో చూద్దాం. ఈ రంగంపై తెర తెరువబడగా, హెబ్రోనులో తన కుమారుడైన అబ్షాలోము రాజుగా తన్ను తాను ప్రకటించుకొన్న విషయం అతని చెవ్వులకు అందింది. సైన్యంలో ఎక్కువ భాగం అతనికి మద్దతు పలుకుతున్నట్టును, వారు యెరూషలేమను తన రాజధాని నగరం మీదికి వస్తున్నట్టు కూడా దావీదుకు వినిపించింది. దావీదు ఆ సమాచారాన్ని విన్నప్పుడు, తన రాజ నగరులో ఉన్నవారందరితో, "-అబ్షాలోము చేతిలోనుండి మనము తప్పించుకొని రక్షణ నొందలేము; మనము పారిపోదము రండి" అని చెప్పాడు (2 సమూ. 15:14).

వెంటనే దావీదు యింటివారు పట్టణాన్ని విడిచి పారిపోయారు. అబ్షాలోము సేనలను తమను యొర్దాను నది మధ్య నిలుపుకొందుమనే నిరీక్షణతో, వారు తూర్పువైపుకు పయనించారు. వారు ఒలీవకొండ ఎక్కుచుండగా, వెనుక పట్టణంలోనుండి విలాపం వినిపిస్తుంది.

> అయితే దావీదు ఒలీవచెట్ల కొండ యెక్కుచు ఏడ్చుచు, తల కప్పుకొని పాదరక్షలు లేకుండ కాలినడకను వెళ్లెను; అతని యొద్దనున్న జనులందరును తలలు కప్పుకొని యేడ్చుచు కొండయెక్కిరి (15:30).

తాను ఎందుకు ఏడ్చాడో మనం దావీదును అడుగగలిగియుండినట్లయితే, అతని జవాబు యిలా ఉంటుంది: "నేను ఏడుస్తున్నది ఎందుకంటే, తండ్రీ, నేను నా బాధ్యతను నిర్వహించడంలో తప్పిపోయాను, యిప్పుడు నా కుమారుడు నా ప్రాణము తీయజూస్తున్నాడు. నేను ఏడుస్తుంది ఎందుకంటే – నా పాపములు నన్ను ఆపదల్లో పెట్టడం మాత్రమే గాక, నన్ను ప్రేమించిన వారినందరిని అదే స్థితిలో నిలిపాయి. నేను ఏడుస్తుంది ఎందుకంటే, దేవుని పట్టణం, అందలి నివాసులును యిబ్బందులకు గురిచేయబడ్డారు. నేను ఏడుస్తున్నది ఎందుకంటె, నేను అరవై ఏండ్లు పైబడినవాడనై యున్నాను, నేను సాధించ ప్రయత్నించింది అంతా ఏమి లేనట్టే కన్పిస్తుంది." అతడు కొంచెం సేపు ఆగి, "నేను ఏడుస్తున్నది ఎందుకంటే ప్రభువు చేస్తున్న శిక్ష కష్టంగా ఉంది" అని తెలుపవచ్చు.

తన పాపములు తన తలమీదికి వచ్చిన తుఫానులచే దావీదు కొట్టబడి గాయపరచబడి ఉన్నాడు. లోలోపల అతనికి రక్తం కారుతూ ఉంది. దోషంతో అతడింకను పోరాడుతూ ఉన్నాడు. తన యింటివారి సమస్యలనే తీర్చలేక సతమతమౌతున్నాడు. సమస్య వచ్చినప్పుడు కార్యాన్ని జరిగించే దానికి బదులు ప్రతిచర్య చేస్తున్నాడు. "మనము పారిపోదము రండి" అన్న ఈ దావీదే ఒలీవ కొండ చరియను ఎక్కుతూ, ఏడుస్తూ రాజులా కాక ఒక భిక్షకునిలా కన్పించాడు.

దానితో దావీదు అంతమయ్యాడనిగాని, లేక దేవుడు అతనితో తన పనిని ముగించాడని గాని అర్థం కాదు. దావీదు పడగొట్టబడ్డాడే గాని, పడద్రోయబడలేదు. అతడు కొట్టబడ్డాడు గాయపరచబడ్డాడే గాని చితికిపోలేదు. నా పఠనం కొనసాగిస్తుండగా, తన జీవితంలోని యింతటి హీనమైన స్థితిలో సహితం అతని వైఖరి విషయం నేను ఎంతగానో ఆకర్షితుడనయ్యాను. ప్రభువు చేయు శిక్షను సంతోషంతో భరించడమంటే ఏమో నేర్చుకున్నానని నేను తలంచుతాను.

## ఇతరుల విషయమై అతడు అక్కర కలిగియున్నాడు (15:18-22)

దావీదు యింటివారు యెరూషలేమును విడిచి వెళ్లుచుండగా, అతడు ఆగి – తన యింటివారిలో ప్రతి ఒక్కరు దాటిపోయేవరకు కనిపెట్టాడు. చివరిగా, గిత్తీయుడైన ఇత్తయి తన జనులతో వచ్చాడు.[1] "గిత్తీయుడు" అంటే ఇత్తయి గాతు పట్టణంనుండి వచ్చినవాడని అర్థం. అతడు ఫిలిష్తీయుల అధిపతి – దావీదు సైన్యంలో చేరడానికి కొంతమంది సైనికులతో అతడు వచ్చినట్టున్నాడు. దావీదు అతని నిలిపి యిలా అన్నాడు:

> రాజు గిత్తీయుడగు ఇత్తయిని కనుగొని – నీవు నివాస స్థలము కోరు పరదేశివై యున్నావు; నీ వెందుకు మాతోకూడ వచ్చుచున్నావు? నీవు తిరిగి పోయి రాజున్న స్థలమున ఉండుము.[2] నిన్ననే వచ్చిన నీకు, ఎక్కడికి పోవుదుమో తెలియకయున్న మాతోకూడ ఈ తిరుగులాట యెందుకు? నీవు తిరిగి నీ సహోదరులను తోడుకొని పొమ్ము; కృపా సత్యములు నీకు తోడుగా ఉండును గాక యని చెప్పగా (15:19, 20).

ఇక్కడ దావీదు – "రాజు" అని అబ్షాలోమును సూచిస్తున్నాడు. దావీదు ఎరిగినంత మట్టుకు, తన పరిపాలన ముగిసిపోయింది. భవిష్యత్తులో ఏమి జరుగబోతుందో అతనికి తెలియదు. ఆలాటి పరిస్థితిలో, "అప్పుడు నాకు ఏమి సంభవించుతుంది?" అని నా ఆలోచనలు నా మీదనే కేంద్రీకృతమైయుండేవే. ఇత్తయిని, అతని మనుష్యులను వారి కుటుంబాలను గూర్చి ఆలోచించినప్పుడు వారు ఎట్టి క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకొనిపోయారో దావీదు చూచాడు. "నీవు నాతో రానవసరం లేదు. పట్టణంలోనికి పొమ్ము, నేను గ్రహించుకోగలను."

ఇతరుల పట్ల దావీదు కనుపరచిన అక్కర బైబిల్లో సమర్పణతో కూడిన ఒక గొప్ప ప్రతిపాదనకు పిలుపునిచ్చింది: "ఇత్తయి–నేను చచ్చినను బ్రదికినను, యెహోవా జీవముతోడు నా యేలినవాడవును రాజువునగు నీ జీవముతోడు, ఏ స్థలమందు నా యేలినవాడవును రాజువునగు నీవుందువో ఆ స్థలమందే నీ దాసుడనైన నేనుందునని రాజుతో మనవిచేసెను" (15:21).

మన జీవితాలలో సమస్యలు రేగినప్పుడు, ఒక చీకటి మూలలో చేసి "అయ్యో, నాకు శ్రమ" అని పాడుతూ, మన గాయాలను నాకుతూ, గందరగోళంలో పడడం జరుగుతుంది. మనం దేవుని శిక్షను సంతోషంగా అంగీకరింప నేర్చుకొన్నట్టయితే, మనం మనలోనుండి వెలుపలికి వచ్చి – యితరుల అవసరతలమీద – ప్రత్యేకించి మనకు సంబంధించిన దానిని బట్టి బాధింపబడిన వారి అవసరాలపై మనం దృష్టి నిలుపవలసి ఉంటుంది.

## అతడు తన భవిష్యత్తును దేవుని చేతుల్లో ఉంచుతాడు (15:23-29)

గిత్తీయుడైన ఇత్తయి కిద్రోను వాగు దాటబోయే సమయంలో. సాదోకును, అబ్యాతారును వస్తారు. గిద్యోనులోనున్న ప్రత్యక్షగుడారమును, యెరూషలేములోనున్న యెహోవా మందసమును జాగ్రత్త చేయడానికి దావీదుచే వీరిద్దరును యాజకులుగా నియమింపబడినవారు. నిబంధన మందసాన్ని యాజకులు తనతో కొనిపోతూ ఉండేవారు.[3] వారు రాజుతో వెళ్ల సిద్ధపడ్డారు. అయితే దావీదు యిలా అన్నాడు:

> అప్పుడు రాజు సాదోకును పిలిచి – దేవుని మందసమును పట్టణములోనికి తిరిగి తీసికొనిపొమ్ము; యెహోవా దృష్టికి నేను అనుగ్రహము పొందినయెడల ఆయన నన్ను తిరిగి రప్పించి దానిని తన నివాసస్థానమును నాకు చూపించును; నీయందు నా కిష్టములేదని ఆయన సెలవిచ్చినయెడల ఆయన చిత్తము – నీ దృష్టికి అనుకూలమైనట్టు నాయెడల జరిగించుమని నేను చెప్పుదును ... (15:25, 26).

అటు యిటు తిప్పడానికి మందసం అదృష్టాన్ని వరించే సాధనం కాదని దావీదుకు తెలుసు. ఇశ్రాయేలీయులకు నిజమైన రాజు యెహోవా రాజు అని గుర్తు చేసేలా, అది యెరూషలేములోనే నిలిచియుండాలి. దావీదు ప్రతిపాదనలో కొట్టవచ్చినట్టు కన్పించేది అతని స్వభావమే. దేవుని శిక్షను సంతోషంతో అంగీకరించడం అంటే ఏమో దావీదు మాటలు నిర్వచిస్తాయి. వాటిని మరల చదువు:

> యెహోవా దృష్టికి నేను అనుగ్రహము పొందినయెడల ఆయన నన్ను తిరిగి రప్పించి, దానిని [మందసాన్ని] తన నివాసస్థానమును [దేవుని నివాస స్థలమంటే–యెరూషలేము] నాకు చూపించును; (అయితే) నీయందు నాకిష్టము లేదని ఆయన సెలవిచ్చినయెడల (అది) ఆయన చిత్తము, – నీ దృష్టికి అనుకూలమైనట్టు నాయెడల జరిగించుమని నేను చెప్పుదును ... (15:25, 26).

చిన్నతనంలో దావీదు గొల్యాతును చంపడం తిలకించినప్పుడు, మనం ఆశ్చర్య పోయాం. పారిపోయినవాడును, తనకు శత్రువుగానుండిన సౌలును చంపడానికి అతడు నిరాకరించినప్పుడు మనం ఆశ్చర్యచకితులమై నిలిచాం. సైనికుడుగాను, ఏలికగాను అతని విజయాలను మనం అభినందించాం. ఈ సాధనాలన్నీ దేవునియందలి తన విశ్వాసంవలన సాధించాడు. ఏదియెలాగున్నా, యిప్పుడైతే దావీదు కొట్టబడినవాడై హృదయం పగిలినవాడైయున్నాడు. ఇంతకు పూర్వము మనం చూడని ఒక దానిని మనం అతనియందు చూస్తున్నాం. పరిపక్వతను తిలకిస్తున్నాం. "దేవా మాకు విజయమిమ్ము" అని అతడు మనవి చేయడంలేదు సరిగదా, "దేవా యెహోవా, నేను ఏమి చేయాలో తెలియజేయుమని" కూడా అతడు ప్రార్థించడం లేదు. కాని అతడు ఆయన ఎదుట సాగిలపడి, "నాతో నీకు ఏది యిష్టమో దానినే జరిగించు, సింహాసనానికి తిరిగి రావడం నీకు యిష్టమైతే సరి, ఒకవేళ అది నీ చిత్తం కాకపోతే అది కూడా సరియే. శ్రేష్ఠమైనదేదో

నీకు తెలుసు. నా పట్ల నీకు ఏది ఉత్తమంగా తోస్తుందో దానినే జరిగించు" అని అతడు మనవి చేస్తున్నాడు.

యెరూషలేముకు తిరిగి వెళ్లవలసిందిగా దావీదు సాదోకు, అబ్యాతారులకు ఆదేశించినప్పుడు, వారు నిరాశపడినట్టు కన్పిస్తుంది. తనతో వారు పయనించేదానికంటే, వారు అక్కడ ఉండడమే తనకు ఎక్కువ ప్రయోజనమని దావీదు వారికి తెలియజేశాడు. వారు అక్కడ అతనికి కన్నులుగాను, చెవులుగాను పనికి వస్తారు. "అబ్షాలోము వచ్చినప్పుడు" "ఏమి జరుగుతుందో చూచి మీ పిల్లల ద్వారా నాకు వర్తమానం పంపండి.[4] మీ వద్దనుండి సమాచారం అందేవరకు నేను యొర్దానుకు[5] యివతల ఉంటాను అన్నట్టు రాజు వారికి చెప్పాడు." ఆ మాటలతో అబ్యాతారు, సాదోకులు సంతుష్టి చెంది, మందసాన్ని తిరిగి యెరూషలేముకు కొనిపోయారు.

## తన ఉద్వేగాలను వ్యక్తపరచడానికి అతడు భయపడలేదు (15:30-37)

సాదోకు, అబ్యాతారులు వెళ్లిపోయిన తరువాత, "దావీదు ఒలీవచెట్ల కొండ యెక్కుచు ఏడ్చుచు, తల కప్పుకొని పాదరక్షలులేకుండ కాలినడకను వెళ్లెను" -తనతోనున్న ప్రజలందరును ఏడ్చిరి (15:30).

మనం శిక్షణలో ఉండే కాలం విచారకరమైనది. మనం దాన్ని తోసివేయలేం. దాన్ని గూర్చి మనం అధికంగా శోకం చెందవచ్చు. (దీన్ని గూర్చి ముందుకు యింకా ఎక్కువ మాట్లాడుకోబోతాం); అయితే కన్నీళ్లు లేకుండ ఉండవు. వాటిని గూర్చి మనం సిగ్గుపడనవసరం లేదు. అవి లేకుంటే, గాయాలు మానడానికి ఆటంకం కలుగుతుంది. మన బాధను నిష్కపటంగా అంగీకరించడం మనకు సహాయపడుతుంది. తన హృదయ వేదనను వ్యక్తపరచడంలో దావీదు భయపడలేదు.

అబ్షాలోముతో కూడ కుట్రలో ఉన్నవారిలో అహీతోపెలు జతకూడాడన్న వార్త అందినతోడనే దావీదు దుఃఖ భారం అధికమయ్యింది. అహీతోపెలు దావీదు యొక్క నమ్మకమైన సలహాదారులలో ఒకడు. ఏదియెలాగున్నా, తన్నుగూర్చి తాను జాలిపడడంతో దావీదు సమయం వృథా చేసికోలేదు. కాని, "-యెహోవా, అహీతోపెలు యొక్క ఆలోచనను చెడగొట్టుమని" దావీదు ప్రార్థించాడు (15:31).

దాదాపు వెంటనే దావీదు మనవి నెరవేరనారంభించింది. దావీదు ఆ పర్వత శిఖరమునకు వెళ్లినప్పుడు[6] అర్కీయుడైన హూషైను[7] కలిసికొన్నాడు. హూషై రెండు సార్లు దావీదు స్నేహితునిగా పేర్కొనబడ్డాడు (15:37; 16:16).[8] దావీదు దర్బారులలో అతడు ఒక నమ్మదగిన సభ్యుడును, దావీదు సలహాదారులలో ఒకడై యుండేవాడు. సాదోకు, అబ్యాతారులవలె హూషై కూడా దావీదుతో వెళ్లవలెనని కోరుకున్నాడు. అయితే, దావీదు మరొకమారు తన తల వ్యతిరేకంగా ఊగించాడు. "-నీవు నాతో కూడ వచ్చినయెడల నాకు భారముగా ఉందువు" అని దావీదు అతనితో అన్నాడు (15:33). ఇంకా ఒకరిని దావీదు పోషింపవలసి వస్తుంది.

తన మాటలను మృదువుగా చేస్తూ హూషైని తన ప్రార్థనకు ప్రతిఫలంగా దేవుడు పంపినట్టు దావీదు అతనికి తెలిపాడు. – అహీతోపెలు యోచనను వ్యర్థపరచడంలో అతడు సాధనమైన్నట్టు తెలిపాడు.

> నీవు పట్టణమునకు తిరిగి పోయి – రాజా, యింతవరకు నీ తండ్రికి నేను సేవ చేసినట్లు ఇకను నీకు సేవచేసెదనని అబ్షాలోముతో చెప్పినయెడల నీవు నా పక్షపు వాడవై యుండి **అహీతోపెలు యొక్క ఆలోచనను చెడగొట్టగలవు** (15:34; ఒత్తి పలకడం నాది).[9]

తనకు తెలిసిన సమాచారం సాదోకునకును, అబ్యాతారుకును అందించవలసిందిగా హూషై ఆదేశింపబడ్డాడు. ఆ సంగతిని వారు తనకు (దావీదుకు) అందిస్తారు.

## తనకు సహాయపడే స్నేహితులు తనకున్నారు (15:21, 24, 32-34; 17:27-29)

ఈ కథలో ముందుకు సాగక మునుపు యిక్కడ ఆగి ఒక విషయాన్ని నొక్కి చెప్పాలని తలంచుతున్నాను. దావీదు స్నేహితులలో పలువురు అతనికి సహాయపడడానికి అతని చుట్టు తిరుగుతున్నట్టు చూచాం. ఈ పాఠంలో యింకా కొందరిని చూస్తాం. మనం దేవునిచేత శిక్షింపబడే సమయంలో, బలపరచి, అండగా నిలిచే స్నేహితులుండడం మేలుగా ఉంటుంది.[10]

వారు దావీదుకు సహాయం చేశారనేది కాక దావీదు స్నేహితులలో ఎక్కువ మందిని గూర్చి మనకు అంతగా తెలియదు. వారిని గూర్చి మనకు తెలిసిందంతా: అబ్షాలోము యెరూషలేము మీదికి దండెత్తిన తరువాత వారు దావీదుకు స్నేహితులైనవారు కారు. దీనికి ఎంతో ముందుగానే దావీదు తన స్నేహ హస్తం వారికి అందించాడు – మరియు దయారసమనే రొట్టెను దావీదు నీళ్లమీద ఎప్పుడో చల్లాడు. అది యిప్పుడు అతనికి తిరిగి వస్తుంది (ప్రసంగి 11:1).

దేవుడు చేయు శిక్షకు సిద్ధపడడం శిక్ష ఆరంభమైనప్పుడు కాదు సుమీ – దానికి ముందు – దానికి ఎంతో ముందు. "అండమానులో తుఫాను బయలుదేరి చెన్నైవైపుకు ప్రయాణం చేస్తుందని" వాతావరణ కేంద్రం ప్రకటించిన తరువాత, తుఫాను షెల్టర్స్ కొరకు త్రవ్వకాలు ఆరంభించడం అర్థ రహితం.[11] జీవిత తుఫానులు మన తలలమీద పడుతూ ఉండగా, స్నేహమనే గొడుగును సంపాదించుకొన జూడడం చాల ఆలస్యం అయ్యిందన్నమాటే.

రాబోయే దేవుని క్రమశిక్షణ కొరకు, దేవునితో మనకున్న బాంధవ్యాలను యితరులతో మనకు ఉండవలసిన సంబంధాలను మెరుగుపరచుకొంటూ మనం సంసిద్ధులమై ఉండాలి. "స్నేహితులు గలవాడు తానే స్నేహ భావముగలవాడై యుండాలి" (సామె. 18:24; KJV).

## అతడు పరీక్షింపబడ్డాడు (16:1-14)

హూషై దావీదును విడిచివెళ్లిన తరువాత, ఒలీవ కొండ యొక్క తూర్పు చరియకు రాజు దిగివెళ్లాడు. అతడు దిగుతూ ఉండగా సీబా అను మరో వ్యక్తిని అతడు కలుసుకున్నాడు. మెఫీబోషెతు యొక్క భూముల బాధ్యత అతనిపై ఉంచబడింది. రాజు యింటివారు ఎక్కడానికి రెండు గాడిదలు, రొట్టెలు, అంజూరపు అడలు, ద్రాక్షారసం అతడు కొనివచ్చాడు. రాజు వెడలిపోకముందే అది అతనికి అందించడానికిగాను, దావీదు వెళ్లిపోనున్న సంగతి వినిన వెంటనే సీబా చర్యకు దిగినవాడైయుండాలి. అతడు కంటబడడం రాజుకు యిష్టంగా ఉన్నట్టుంది.

మెఫీబోషెతు ఎక్కడ ఉన్నది నీకు తెలియునా అని దావీదు సీబాను అడిగాడు[12] అతడు జవాబు చెప్పేటప్పుడు సీబా చతురమైన చిరునవ్వు నవ్వి యిలా అంటున్నాడు: "–చిత్తగించుము, ఈవేళ ఇశ్రాయేలీయులు తన తండ్రి రాజ్యమును తనకు తిరిగి యిప్పింతురనుకొని అతడు యెరూషలేములో నిలిచియున్నాడనెను" (16:3). చమత్కారపు చిరునవ్వు నవ్వియుంటాడని అనడంలో నా ఉద్దేశమేమంటే – తాను కావాలనుకొన్నది పొందడానికి ఏమి పలకడానికైనా వెనుకాడని స్వార్థపరుడైయున్న అవకాశ వాదియని నా నమ్మకం. లేకుంటే బలిష్ఠుడై, అందగాడై, ప్రజల హృదయాలను ఆకట్టుకొని, ఒక సైన్యాన్ని నడిపించే యౌవనుడైన అబ్షాలోము చేతిలోనుండి కుంటివాడైన మెఫీబోషెతు రాజ్యాన్ని ఎలా లాగివేసికోగలడు? రెండింటిలోను ఏదో ఒక ప్రతిపాదన రైటైయుండాలి: మెఫీబోషెతు పూర్ణంగా బుద్ధిహీనుడు, కృతజ్ఞత లేనివాడైనా అయ్యుండాలి లేదా సీబా పూర్తిగా అబద్ధికుడైనా అయ్యుండాలి. రెండోదే రైటని నా నమ్మకం.

ఏదియెలాగున్నా, సీబా కనుపరచిన దాతృత్వంచే ముగ్దుడైన దావీదు, మెఫీబోషెతు ఆస్తి అంతా అతను తీసికొనవచ్చునని సెలవిచ్చాడు.

క్రమశిక్షణకు సంబంధించి మనం ఎరుగవలసిన పలు సత్యాలను ఈ పరిస్థితి ఉదహరిస్తుంది: మనం బాధింపబడేటప్పుడు మంచి రక్షణలేని లేక గాయపడినవారంగా ఉంటాం. సీబా దావీదు స్థితిని అవకాశంగా తీసికొన్నట్టు – మంచి రక్షణలేని మన స్థితిని యితరులు అవకాశంగా తీసికొంటారు. గాయపడిన జనులను ఒక వ్యక్తిపట్ల ఆకర్షితులౌతారు. ఆలాటి వ్యక్తి తన స్వప్రయోజనాల కొరకు అతని లేక ఆమెపట్ల జాలిని కనుపరుస్తాడు.[13] అంటే అతడు తప్పులు ఎన్నేవానిలా ఉంటాడని దాని అర్థం కాదు. మోసగింపబడకుండ చూచుకోవాలని దాని అర్థం.

ఇది ముందు మనం చర్చించని క్రమశిక్షణ ఉద్దేశ్యాన్ని పరిచయం చేస్తుంది. దేవుని క్రమశిక్షణ మనను పరీక్షించే విధానంలో ఒక అర్థం ఉంది – మనం ఆ పరీక్షలో నెగ్గితే, అది మనలను శ్రేష్ఠమైన వారినిగా చేస్తుంది.[14] నాతాను యొక్క ప్రవచనాలు నిజము కాగా, దావీదు అనేక స్థాయిల్లో పరీక్షింపబడ్డాడు. అతని విశ్వాసం పరీక్షింపబడింది. అతని హృదయం పరీక్షింపబడింది. అతని సహనము పరీక్షింపబడింది. అబ్షాలోమునుండి అతడు పారిపోగా, ఆ పరీక్షలు కొనసాగించబడ్డాయి. అతి కష్టమైన పరీక్షలలో ఒకటి ఎదురౌస్తుంది.

ఒలీవ కొండ యొక్క తూర్పు చరియను దిగుతూ ఉండగా, దావీదు బహూరీమను గ్రామం దగ్గరకు చేరుకున్నాడు. షిమీ అనే సౌలుయొక్క బంధువుడొకడు దావీదును దూషించుతూ, అతనిపై రాళ్లు రువ్వుతూ బయలుదేరాడు:

> ఈ షిమీ – నరహంతకుడా, దుర్మార్గుడా ఛీపో, ఛీపో – నీవేలవలెనని నీవు వెళ్లగొట్టిన సౌలు ఇంటివారి హత్యను యెహోవా నీ మీదికి రప్పించి, యెహోవా నీ కుమారుడైన అబ్షాలోము చేతికి రాజ్యమును అప్పగించి యున్నాడు; నీవు నరహంతకుడవు గనుకనే నీ మోసములో నీవు చిక్కుబడి యున్నావని చెప్పి రాజును శపింపగా (16:7, 8).

నీవు సరియైన రక్షణలేని స్థితిలో లేక గాయపరచబడే అవకాశమున్న స్థితిలో ఉన్నప్పుడు, సీబావంటివారు దాన్ని అవకాశంగా తీసికొంటారని నేను ప్రస్తావించాను. ఇంకోరకమైన వ్యక్తులు కూడా, మరోవిధంగా ఆ పరిస్థితిని అవకాశంగా తీసికొంటారు. షిమీ దావీదుకు చేసినట్టు – నీవు క్రిందపడినప్పుడు ఆలాటి జనులు నిన్ను కాళ్లతో తన్నుతారు. నీ గాయాలు మానడానికి మారుగా, నీ బాధను అది అధికం చేస్తుంది! షిమీ చేసినటువంటిదైతే, అలా మీద పడడం న్యాయ సమ్మతం కానప్పుడు మరీ కష్టంగా ఉంటుంది.

అబీషై "వాని తలను ఛేదించి వస్తానని" రాజుయొక్క అనుమతి కొరకు అర్థిస్తాడు (16:9). అప్పుడు దావీదు స్థలంలో నేనే ఉండి ఉంటే, "అది మహా గొప్పగా ఉంది. అతడు విసిరిన రాళ్లలో ఒకటి నాకు తగిలింది. అతని తిట్లు నా చెవిలో యింకా గింగురుమంటునే ఉన్నాయి, వానిని తుంచివేయ్" అనియుండవచ్చు! జనులు మన గాయములను రేపినప్పుడు, తిరిగి మనం వారిని కొట్టజూడవచ్చు. దావీదైతే దానికి సమ్మతింపక యిలా అన్నాడు,[16]

> –సెరూయా కుమారులారా, "మీకును నాకును ఏమి పొందు?" వానిని శపింపనియ్యుడి, "దావీదును శపింపుమని" యెహోవా వానికి సెలవియ్యగా – నీవు ఈలాగున నెందుకు చేయుచున్నావని ఆక్షేపణ చేయగలవాడెవడని చెప్పి అబీషైతోను తన సేవకులందరితోను పలికినదేమనగా, – నా కడుపున బుట్టిన నా కుమారుడే నా ప్రాణము తీయచూచు చుండగా ఈ బెన్యామీనీయుడు ఈ ప్రకారము చేయుట ఏమి ఆశ్చర్యము? వానిజోలి మానుడి, యెహోవా వానికి సెలవిచ్చి యున్నాడు గనుక వానిని శపింపనియ్యుడి. యెహోవా నా శ్రమను లక్ష్యపెట్టునేమో, వాడు పలికిన శాపమునకు బదులుగా యెహోవా నాకు మేలు చేయునేమో (16:10–12).

దావీదు దేవుడు చేసిన శిక్షను సంతోషంతో ఎలా అంగీకరించాడో మరల మనం చూస్తున్నాం. దేవుని హస్తము షిమీ క్రియలలో ఉండవచ్చునని దావీదు గుర్తిస్తున్నాడు. దేవుని ఏర్పాట్లు ఆయన ఉద్దేశాలన్నీ అతడు ఎరిగియున్నట్టు నటించడం లేదు. "ఒకవేళ యెహోవా అతనికి సెలవిచ్చియుంటే," "యెహోవా నా శ్రమను లక్ష్యపెట్టునేమో" అనేది దావీదు ఆలోచన. అతి ప్రాముఖ్యమైన విషయమేమంటే షిమీ యొక్క దూషణకు దావీదు సంతోషంతో తన్ను లోబరచుకున్నాడు. అలాటి దూషణ తన పాపమునకు మరియొక ఫలితమై ఉండే అవకాశాన్ని అతడు చూచాడు.

దేవుడు మనలను శిక్షించే సమయంలో, దెబ్బకు తిరిగి దెబ్బ కొట్టాలనే ప్రతీకార చర్యను మానివేసేలా జాగ్రత్తపడాలి. మన సమస్యల వెనుక ఉద్దేశాలలో ఒకటి మనలను పరీక్షించడమై యుంటున్నదన్న విషయం గుర్తుంచుకో. దేవుని సహాయంతోనే మనం ఆ పరీక్షలో నెగ్గగలం. ఆ పరీక్షలో నెగ్గినప్పుడు మనం శ్రేష్ఠమైన ప్రజలుగా రూపొందుతాం. దావీదు జీవితంలో పని చేసినట్టు దేవుడు మన జీవితాల్లో కూడా పని చేయునట్టు మనం నిబ్బరంగా నిలిచి ఆయనను మన జీవితాల్లో పనిచేయనిద్దాం.

## దేవుడు అతనికి సహాయం చేశాడు (16:15-17:23)

16:15లో దృశ్యం తిరిగి యెరూషలేమునకు మళ్లించబడింది. అబ్షాలోము పట్టణంలోనికి ప్రవేశించినప్పుడు, హెబ్రోను ప్రాంతంనుండి – అతని వెంటవచ్చిన సైన్యం మరియు జన సమూహంతో పట్టణం బహుగా ఉల్లసించింది.[17]

అబ్షాలోము సమీపించినప్పుడు, అర్కీయుడైన హూషై – "రాజు చిరంజీవియగును గాక. రాజు చిరంజీవియగును గాక" అని కేకలు వేశాడు (16:16). యెరూషలేమునకు తిరిగి వెళ్లుమని దావీదు పంపిన తన స్నేహితులలో హూషై ఒకడు. హూషై మాటలు స్పష్టమైన అర్థం యివ్వలేదు (అవి రాజైన దావీదును సూచించియుండవచ్చు ఎందుకంటె దావీదు యింకను రాజుగానే ఉన్నాడు గదా). అబ్షాలోము ఉబ్బించబడుతున్నాడు గాని అతనికి అనుమానంగానే ఉంది. ఇంకా అధికమైన అనుమానం అతని మాటల్లో తొంగి చూస్తుంది: "యెహోవాయును ఈ జనులును ఇశ్రాయేలీయులందరును ఎవని కోరుకొందురో నేను అతని వాడనగుదును, అతని యొద్దనే యుందును" అని హూషై అంటాడు (16:18). ఈ మాటలు అబ్షాలోమును గూర్చియై యుండనవసరం లేదు. ఎందుకంటే యెహోవా దేవుడు అబ్షాలోమును కోరుకున్నట్టు ఆధారం లేదు; అవి దావీదునకే సరిపోతాయి. అయినా, ఆ మాటలు అబ్షాలోమును తృప్తిపరచినట్టున్నాయి. తిరుగుబాటు చేసిన ఆ యువకుడు రాజ నగరులోనే దినాలు కొనసాగించాడు.

తరువాత ఏమి జరిగించాలో అబ్షాలోమునకు తోచిఉండదు. గతంలో దావీదుకు మంత్రిగాఉన్న అహీతోపెలు, అతని తండ్రి ఉపపత్నులతో పొమ్మని అబ్షాలోముకు సలహా యిస్తాడు. అతడు తన తండ్రికి భయపడడనియు, తన తండ్రితో తనకున్న సమస్త బాంధవ్యాలు తెంచబడ్డాయనియు చూపడానికి ఈ పని జరిగింది.[18] అటు తరువాత – దావీదును తరమడంలో సమయం యికను వ్యర్థం చేయవద్దనియు – దావీదు యింకా తడబడి నడుస్తూ ఉండగా చావు దెబ్బ కొట్టాలనియు అహీతోపెలు సలహా యిచ్చాడు:

> దావీదు అలసట నొంది బలహీనముగా నున్నాడు గనుక – నేను అతనిమీద పడి అతని బెదరించినయెడల అతని వద్దనున్న జనులందరు పారిపోదురు; రాజును[19] మాత్రము హతముచేసి జనులందరిని నీతట్టు త్రిప్పెదను; నీవు వెదకు మనిషిని నేను పట్టుకొనగా జనులందరు వచ్చి నీతో సమాధానపడుదురు గనుక నీ చిత్తమైతే నేను పండ్రెండు వేలమందిని ఏర్పరచుకొని పోయి యీ రాత్రి దావీదును తరిమి పట్టుకొందునని అహీతోపెలు అబ్షాలోముతో చెప్పగా ... (17:1-3).

తన తండ్రియొక్క ఉపపత్నులతో పొమ్మని యిచ్చిన అహీతోపెలు యొక్క సలహా భయంకరమైనది.[20] అయితే ఈ సలహా అనుకూలంగా ఉంది.[21] అబ్షాలోము దానిని అనుసరించి యుండినట్టయితే విజయము తప్పకుండ త్వరలోను వచ్చియుండేది. అయితే దేవుని కరుణా హస్తాన్ని బట్టి, అహీతోపెలు యోచనను నిరర్థకం చేయడానికే హూషై అక్కడ ఉంచబడ్డాడు. రెండవ అభిప్రాయం కొరకు అబ్షాలోము హూషైని సంప్రదించాడు.

అహీతోపెలుని పన్నాగాం అబ్షాలోముకు తెలిపినప్పుడు, అతని ప్లాన్ ఎందుకు పనిచేయదో – మూడు కారణాలను హూషై సూచించాడు: అహీతోపెలు దావీదు యొక్కయు అతని సేనయొక్కయు యుద్ధ సామర్థ్యాన్ని తక్కువగా అంచనా వేసింది: (1) "నీ తండ్రియు అతని పక్షమున నున్నవారును మహా బలాఢ్యులనియు, అడవిలో పిల్లలను పోగొట్టుకొనిన యెలుగుబంట్లవలె" రేగిన మనస్సుగలవారై యున్నారు (17:8). (2) అది దావీదు దూరదృష్టిని తప్పుగా అంచనావేసింది: నీ తండ్రి యుద్ధమునందు ప్రవీణుడు, అతడు జనులతో కూడ బసచేయడు అతడేదో ఒక గుహయందో మరి ఏ స్థలమందో దాగియుండును (17:9). ఈ విధంగా మీరు దావీదు శిబిరం మీద పడినప్పుడు అతడు తప్పించుకొనిపోతాడు. (3) అది దావీదు యొక్క యుద్ధ నైపుణ్యాన్ని తక్కువ అంచనా వేసినట్టుంది: ఇంతకు హూషై ఏమంటాడంటే – "దావీదు మనుష్యులు మనమీద పడడానికి సిద్ధంగా ఉన్నారు. మనం వారిమీదికి పోయామంటే, వారు మనలను ఓడిస్తారు – మన పని వ్యర్థమౌతుంది" (17:9, 10).

హూషై మాటల్లో నిజం లేదు. కొట్టబడిన దావీదు యొర్దానుకు అవతల వణకుతూ కూర్చున్నాడు. సైనిక చర్య మారి మనస్సులోనుండి బహు దూరంగా ఉంది. దావీదు రేగుతున్న ఆడ ఎలుగుబంటి కాదు, అతడు కొట్టబడిన కుక్క. ఏదియెలాగున్నా, దావీదు యొక్క పేరు అబ్షాలోము మీదను అతని సైనికులమీదను ప్రశ్నార్థకంగా నిలిచియుంది.

గనుక దానికి బదులు హూషై వేరొక ప్లాను వేశాడు. దేశమంతటిలోనుండి మహా గొప్ప సైన్యాన్ని అబ్షాలోము సమకూర్చుకోవాలన్నాడు. అప్పుడు అబ్షాలోమే నేరుగా సైన్యాన్ని నడిపించాలని అన్నాడు,[22] అప్పుడు విజయం తనదేనని జనులు భావిస్తారని అతడు చెప్పాడు. అలా చేసినట్టయితే వారు దావీదును అతని సైన్యాన్ని నిర్వీర్యులుగా చేయవచ్చునన్నాడు! హూషై ప్లాను – అబ్షాలోమును విజయోత్సవంతో యెరూషలేము లోనికి ఊరేగింపుతో తెస్తుందని – అతడు చూడగలిగాడు! "అబ్షాలోమును ఇశ్రాయేలు వారందరును ఈ మాట విని అర్కీయుడగు హూషై చెప్పిన ఆలోచన అహీతోపెలు చెప్పినదానికంటె యుక్తమని ఒప్పుకొనిరి" (17:14). ఆ విధంగా అహీతోపెలు యోచనను చెడగొట్టుమని దావీదు చేసిన ప్రార్థనకు జవాబు లభించింది.

తన సలహా నిరాకరింపబడిందని గ్రహించిన అహీతోపెలు, తన గాడిదమీద యింటికి తిరిగివెళ్లి, తన పనులను చక్కబరచుకొని, తన్ను తానే చంపుకున్నాడు (17:23).[23]

అబ్షాలోము తన మనస్సు మార్చుకొని, దావీదును తరుమ వెళ్లతాడని హూషైకి తెలుసు. అయినా దావీదుకు కొంచెం సమయం లభిస్తుందనియే అతడు ఈ యోచనను అతనికి యిచ్చాడు. హూషై రహస్యంగా సాదోకు, అబ్యాతారుల వద్దకు వెళ్లి – "మీరు త్వరపడి ఈ రాత్రి అరణ్యమందు ఏరు దాటు స్థలములలో ఉండవద్దనియు, రాజును

అతని సమక్షమందున్న జనులందరును నశింపకుండునట్లు శీఘ్రముగా వెళ్లిపోవుదనియు దావీదునకు వర్తమానము పంపుడని చెప్పెను" (17:16).

ఆ వర్తమానాన్ని ఒక పనిపిల్ల ద్వారా సాదోకు అబ్యాతారులు పంపారు. ఈ సమాచారాన్ని దావీదు వద్దకు తీసికొనిపోయే యోనాతాను, అహిమయస్సు[24] అనే యిద్దరు యువకులు గుర్తింపబడ్డారు కాని వారిద్దరు నీళ్లులేని బావిలో ఒక స్త్రీచే[25] దాచబడినవారై తప్పించుకున్నారు. రాత్రుల్లో నదిని దాటడం అపాయకరం. కాని దావీదును అతని జనమును లేచి నదిని దాటారు. "తెల్లవారునప్పటికి నది దాటక మిగిలినవాడు ఒకడును లేకపోయెను" (17:22).

ఆ సందర్భంలో దావీదు ప్రాణాన్ని కాపాడిన మనుష్యుల నింకను గమనించు: హూషై – సాదోకు, అబ్యాతారులు – పనిపిల్ల – యోనాతాను, అహిమయస్సు – బహూరీములోని ఒక పురుషుడు అతని భార్య! బావిలో వారిని దాచిన స్త్రీ ఈమెయే. దేవుడు అద్భుతమైన విధానాల్లో పనిచేస్తూ ఉంటాడు. ఇలాటి సందర్భంలో దావీదు యిలా వ్రాశాడు: "కీర్తనీయుడైన యెహోవాకు నేను మొఱపెట్టగా ఆయన **నా శత్రువుల చేతిలోనుండి నన్ను రక్షించును"** (కీర్తన. 18:3; ఒత్తి పలకడం నాది).[26]

దేవుడు దావీదుకు సహాయం చేయడం నిలుపలేదు: దావీదును అతని జనులందరును యొర్దానుకు తూర్పు దిశనుండి ఉత్తరముననున్న మహనయీమునకు చేరుకున్నారు. ఇష్బోషెతు తన రాజధాని నగరుగా మహనయీమును వాడుకున్నాడు. మహనయీములో ముగ్గురు మనుష్యులు దావీదును ఆహార పదార్థాలతో కలిసికున్నారు. బైబిలు పాఠకులకు వారి పేర్లు అంతగా పరిచయమైనవి కావు: "అమ్మోనీయుల రబ్బా పట్టణపువాడైన నాహాషు కుమారుడగు షోబీయును, లోదెబారు ఊరివాడగు అమ్మీయేలు కుమారుడైన మాకీరును, రోగెలీము ఊరివాడును గిలాదీయుడునైన బర్జిల్లయియు" (17:27). "... పాత్రలు కుండలు గోధుమలు యవలపిండి వేచిన గోధుమలు కాయ ధాన్యములు, చిక్కుడు కాయలు పేలాలు, తేనే, వెన్న గొఱ్ఱెలు జున్ను ముద్దలు దావీదును అతని వద్దనున్న జనులును భోజనము చేయుటకై తీసికొనివచ్చిరి, 'అరణ్యమందు జనులు అలసినవారై ఆకలిగొని దప్పికగొనిఉందురని తలంచి' " వారు ఈ పని చేశారు (17:28, 29).

దావీదు సహాయానికి వచ్చినవారు మిశ్రితులు. షోబీయు అమ్మోనీయుడు – నాహాషు కుమారుడు, దావీదు వర్తమానికులను అవమానించిన అమ్మోనీయుల రాజుయొక్క సహోదరుడు. మాకీరు దక్షణముననున్న లోదెబారునుండి వచ్చినవాడు. మెఫీబోషెతును పెంచినవాడితడు. (మెఫీబోషెతు సింహాసనాన్ని తీసికోబోతున్నాడని సీబా దావీదుకు చెప్పింది అబద్ధమని నమ్మడానికి యిది మరియొక కారణం. మెఫీబోషెతే అలా కుట్ర పన్నుతూ ఉన్నట్టయితే మాకీరునకు కూడా అందులో భాగం ఉండేదే). ఉపకారాలలో మూడో వ్యక్తి బర్జిల్లయి అనే గిలాదు ప్రాంతపు ధనవంతుడైన ప్రధాని.

ఈ జనులు దావీదుకు తెచ్చిన వస్తువులను బట్టియు, ఆహార ధాన్యాలను బట్టియు – దావీదు స్నేహితులు తన పక్షమున సహాయం చేయ వచ్చుటను బట్టియు – గత కాలంలో అతడు చూపిన దయ, తన కష్టకాలంలో అతనికి తిరిగి వచ్చినట్టు కన్పిస్తుంది. ఏదియెలాగున్నా, ఈ స్నేహితులందరి ద్వారా దేవుడు పని చేస్తున్నాడని నేను నొక్కి

చెప్పగోరతాను. ఆయన మనలను శిక్షించే సమయంలో దేవుడు మనలను విడిచిపెట్టడు.

## అతని హృదయం నలిగియుంది

## (17:24-26; 18:1-33)

దేవుడు దావీదునకు మరో కార్యం జరిగించాడు. తన్ను కాపాడుకొనడానికి దేవుడు దావీదుకు ఒక సేనను యిచ్చాడు. దావీదు యెరూషలేమును విడిచినప్పుడు అతనితో కేవలం ఆరువందల మంది సైనికులు మాత్రమే ఉన్నారు. ఏదియెలాగున్నా, 18వ అధ్యాయం మనం ఆరంభించగా, వెయ్యిమందికి ఒక అధిపతిని తన సైన్యంపై దావీదు నియమించినట్టు చూస్తాం (1 వ.).[27] దావీదుకు ముగ్గురు అధిపతులు ఉండగా (2 వ.), "వేలు" అనే పదంలో, కనీసం రెండువేలు అనేది గుప్తమైయుండగా, దావీదు యొక్క ఆరువందల మంది పురుషులు ఆరువేలకు – యింకా ఎక్కువ మందిగా అయ్యుండవచ్చు![28] అబ్షాలోము తన సైన్యాన్ని సమకూర్చుకుంటుండగా, చాలవరకు అతన్ని విడిచి దావీదు వద్దకు వచ్చియుండవచ్చు.

ఏదియెలాగున్నా, చివరిగా అబ్షాలోము తన పెద్ద సైన్యంతో యొర్దానును దాటి గిలాదులో మహనయీమునకు సమీపంగా విడిది దిగాడు.[29]

అది శిలప్రదర్శన సమయం. "నేను మీతోకూడ బయలుదేరుదునని" దావీదు తన సైనికులతో అన్నాడు (18:2). అందుకు జనులు – "నీవు రాకూడదు, మేము పారిపోయినను జనులు దానిని లక్ష్యపెట్టరు, మాలో సగము మంది చనిపోయినను జనులు దానిని లక్ష్యపెట్టరు. మావంటి పదివేల మందితో నీవు సాటి;[30] కాబట్టి నీవు పట్టణమందు[31] నిలిచి మాకు సహాయము చేయవలెనని అతనితో చెప్పిరి" (18:3).

ఇందుకు దావీదు జవాబును ఆలోచించు: "–మీ దృష్టికేది మంచిదో దాని చేసెదను" (18:4). దావీదు తనయందలి నమ్మికను, లేక ఆత్మ విశ్వాసాన్ని కోల్పోయి ఉండవచ్చు గాని తాను పొందిన శిక్షవలన వేరొక దానిని సంపాదించుకున్నాడు: అతడు సాత్వికత్వాన్ని, వినయాన్ని సంపాదించుకున్నాడు.

బాధ ఆలోచనా శక్తిని క్రుంగదీయవచ్చు. నీవు శిక్షింపబడే సమయంలో, నీ వద్దకు చేరనియ్య గలవాడవైయుండాలి. నీకంటె ఎక్కువ స్పష్టంగా చూడగలిగేవారి సలహా తీసికొనడానికి తెరువబడిన హృదయం గలవాడవైయుండాలి.

సైన్యం వెడలిపోయిన పిమ్మట, "–నా నిమిత్తమై యౌవనుడైన అబ్షాలోమునకు దయజూపుడని" దావీదు విన్నవించుకుంటాడు (18:5). అబ్షాలోము యుద్ధ తంత్రము చాలా సరళమైంది: "నా తండ్రిని చంపండి; యితరులను పట్టించుకోనక్కరలేదు." దావీదు యుద్ధ తంత్రం కూడా సరళమైందే: "నా కుమారుని చంపవద్దు యితరులను చంపినా ఫరవా లేదు."

అబ్షాలోము సైన్యానికి యుద్ధంలో ఘోర పరాజయమయ్యింది.[32] గిలాదు[33] లోని చెట్లుగల కొండలు వారికి అనుకూలంగా లేకపోయాయి. కొండల నడుమ యుద్ధం చేయడానికి దావీదు సేనలు ఆరితేరినవారైయున్నారు. అబ్షాలోము సేనను కీకారణ్యంలో

చెల్లా చెదురు చేసారు. వారిలో ఒక్కొక్కరిని తేలికగా పడగొట్టగల పరిస్థితులు ఏర్పడ్డాయి.[34] ఇరవై వేలమంది చనిపోయారు.[35]

జరిగిన నష్టాన్ని గూర్చి పట్టించుకోకుండ దావీదు మహనయీములో నిలిచిపోయాడు. ఎవరు గెలిచెనన్న సంగతి కూడా అతనికి పట్టలేదు. అతడు కేవలం తన బిడ్డ విషయమే అక్కర గలిగియున్నాడు. అహిమయస్సు పరుగెత్తుకొంటూ పట్టణానికి చేరుకున్నాడు. అహిమయస్సు యాజకుడైన సాదోకు కుమారుడు, యొర్దాను అవతలకు దావీదువద్దకు అబ్షాలోము పన్నాగాన్ని గూర్చిన సమాచారాన్ని తెచ్చిన యిద్దరు యువకులలో ఒకడు. గనుక అహిమయస్సురాగా, అది శుభవార్తయైయుంటుందని దావీదు ఎదురు చూచాడు. (ఎందుకంటే, అపజయమైతే అనేకులను సురక్షితమైన పట్టణానికి చేరుస్తుంది). "అంతా క్షేమమే"నన్నట్టు అహిమయస్సు తెలిపాడు (18:28). అహిమయస్సు వెనువెంట ఒక కూషీయుడు వచ్చాడు.[36] "బాలుడగు అబ్షాలోము క్షేమముగా ఉన్నాడా?" అని దావీదు అడుగుతాడు. అందుకు ఆ కూషీయుడు – "నా యేలినవాడా రాజా, నేను నీకు శుభ సమాచారము తెచ్చితిని; యీ దినమున యెహోవా నీ మీదికి వచ్చినవారినందరిని ఓడించి నీకు న్యాయము తీర్చెనని" చెప్పాడు. మరియు రాజు ఆ బాలుని గూర్చి అడిగినప్పుడు –"నా యేలినవాడవును రాజువునగు నీ శత్రువులును నీకు హాని చేయవలెనని నీమీదికి వచ్చినవారందరును ఆ బాలుడున్నట్టుగానే యుందురు గాక" అని బదులిచ్చాడు (18:32).

> అప్పుడు రాజు బహు కలతపడి గుమ్మమునకు పైగానున్న గదికి ఎక్కి పోయి యేడ్చుచు, సంచరించుచు, –నా కుమారుడా అబ్షాలోమా, నా కుమారుడా అబ్షాలోమా, అని కేకలువేయుచు, అయ్యో నా కుమారుడా, నీకు బదులుగా నేను చనిపోయిన యెడల ఎంత బాగుండును; నా కుమారుడా అబ్షాలోమా, నా కుమారుడా, అని యేడ్చుచు వచ్చెను (18:33).

నీ కుమారుడు నీవు కోరుకున్న ప్రకారం పెరగకపోవచ్చు. అతని జీవిత విధానం నీకు వేదన కలిగించవచ్చు. ఏమి సంభవించినా సరే, అతడు నీ కుమారుడు, మరియు అతనికి విపత్తు వస్తే నీవు విలపించుతావు.

శిక్షణ దుఃఖంతో ముడివేయబడింది. నీ కొరకు ప్రాణమిచ్చే స్నేహితులు నీ చుట్టు ఉండవచ్చు. దేవుడు నీతో ఉన్నాడన్న సంగతి నీకు తెలిసి ఉండవచ్చు, ఆయన నీకు సహాయం చేస్తున్నాడన్న సంగతి కూడా నీవు ఎరిగియుండవచ్చు. అయినా కన్నీళ్లు వస్తాయి. నీ గుండె పగిలిపోతుంది. శిక్ష, బాధ అనే రెండింటిని విడదీయలేం. "ప్రతివాడును తన బరువు తానే భరించుకొనవలెను గదా?" (గలతీ. 6:5).

## యోవాబుచే అతడు గద్దింపబడ్డాడు (19:1-8ఎ)

మనం శిక్షపొందే సమయం దుఃఖకరంగా ఉంటుంది, అది లేదన్నట్టు మనం చెప్పుకో పనిలేదని నేను ముందుగానే ప్రస్తావించాను. మనం స్వస్థత పొందే విధానంలో భాగంగా మన ఉద్వేగాలు ఆరోగ్యకరంగా వ్యక్తపరచడం ఉంటుంది. అయితే దుఃఖంలో అధికంగా మునిగిపోయే అవకాశం కూడా ఉంది. అధికంగా మునిగిపోవడం ఆరోగ్యకరం

కాదు. అది మనలను నీరు కార్చేస్తుంది, మన చుట్టునున్నవారిని నిరాశపరచుతుంది. దావీదు అధికంగా దుఃఖంలో మునిగిపోయాడు.

దావీదు నలుగగొట్టబడ్డాడన్న సంగతిని అర్థం చేసికోవచ్చు. అతడు అబ్షాలోము కొరకు మాత్రమే కాదు, తన కొరకును ఎలా పరిస్థితి ఉండవలసియుండేదో దాని విషయం కూడా అతడు విలపించాడు. ఏదియెలాగున్నా, అతని దుఃఖం అర్థరహితమయ్యింది. అతని సింహాసనం అతని కుమారుడు – ఏకంగా అతనికి దక్కే మార్గమే లేదు. పైగా, బహిరంగంగా అతని దుఃఖాన్ని వ్యక్తపరచడంలో, తన వేదనను గూర్చియే అతడు శ్రద్ధ చూపినట్టు ఉన్నాడు కాని, తన చుట్టునున్నవారి విషయం ఏమీ పట్టించుకోలేదు అన్నట్టుగా కనబడ్డాడు. గాఢంగా ప్రేమించిన వానిని పోగొట్టుకున్నది అతడు ఒక్కడు మాత్రమే కాదు. యుద్ధ భూమిలో ఇరవై వేలమంది చచ్చి పడియున్నారు. అన్ని వేలకు మించినవారు తమ కుమారులు, మనుమలు యుద్ధంలో చనిపోయినందుకు తమ బిడ్డలు, భార్యలు, సోదరులు విలపించియుంటారు.

గతంలో యితరులను గూర్చి ఆలోచించడం దావీదు యొక్క బలమైన లక్షణంగా ఉండింది. ఇప్పుడు, అబ్షాలోమును పోగొట్టుకొనడంలో, అతని దృష్టి ఏక పక్షంగా మారిపోయింది. తక్కినది ఏదీ, ఎవరూ అతనికి పట్టడం లేదు.

> రాజు తన కుమారుని గూర్చి దుఃఖించుచు ఏడ్చుచున్నాడను సంగతి ఆ దినమున జనులందరు విని, యుద్ధమందు సిగ్గుతో పారిపోయిన జనులవలె వారు నాడు దొంగ నడకలతో వచ్చి పట్టణములో ప్రవేశించిరి; నాటి విజయము జనులకందరికి దుఃఖమునకు కారణమాయెను (19:2, 3).

దావీదు దుఃఖము తన్ను వెంబడించిన వారందరి జీవితాల్లో నీడలు కమ్మజేశాయి.

రాజనీతి నిపుణుడుగా యోవాబు గతంలో దావీదును ఎన్నడూ గద్దించియుండలేదు. "నీ స్నేహితులయెడల ప్రేమ చూపక నీ శత్రువులయెడల ప్రేమ చూపుచు, ఈ దినమున అధిపతులును సేవకులును నీకు ఇష్టజనులు కారని నీవు కనుపరచితివి. మేమందరము చనిపోయి అబ్షాలోము బ్రదికియుండినయెడల అది నీకు ఇష్టమగునన్న మాట యీ దినమున నేను తెలిసికొనుచున్నాను. ఇప్పుడు లేచి బయటికివచ్చి నీ సేవకులను ధైర్యపరచుము." లేనియెడల ఈ రాత్రి ఒకడును నీవద్ద ఉండడు అన్నట్టు యోవాబు దావీదుతో అన్నాడు (19:5–7).[38]

ఇవి కఠినమైన మాటలు, బాధాకరమైన మాటలు అయినా దావీదు వాటిలో ఉన్న సత్యాన్ని కాదనలేదు. దావీదు యొక్క మనస్సాక్షిని మేల్కొల్పడానికి యోవాబు మాటలు పనిచేశాయి.

దేవునిచేత మనం శిక్ష చేయబడినప్పుడు, బాధ ఎంత అధికంగా ఉంటుందంటే – మనం పూర్తిగా అవివేకులంగా మారి యితరులను బాధిస్తాం. అలాటప్పుడు, సరిగా ఏర్పరచుకున్న మాటలవలన మన వివేకానికి తిరిగి వచ్చేలా కుదిలించగల స్నేహితులు మనకు కావాలి. కొన్ని సార్లు అది బాధ కలిగించవచ్చు; వారి యథార్థత మన కోపాన్ని రేపవచ్చు; అయితే వారు నిజమైన స్నేహితులు, ఒకవేళ అట్టివారే అతి శ్రేష్ఠమైన స్నేహితులై

యుండవచ్చు. "మేలును కోరి స్నేహితుడు గాయములు చేయును పగవాడు లెక్కలేని ముద్దులుపెట్టును" (సామె. 27:6).

తన విలాసపు గదిని దావీదు వీడి, బయట గవిని వద్దకు వచ్చి – అక్కడ ఉన్నవారిపట్ల తన అక్కరను తెలిపాడు.[39] కొందరితో అతడు ఏడ్చాడు. కొందరికి కృతజ్ఞత చెప్పాడు. కొందరిని అతడు అభినందించాడు. ఎట్టకేలకు, ప్రజలు తమ విజయాన్ని ఉత్సవంగా జరుపుకున్నారు.

శోకించడానికొక సమయం ఉండడం నిజమేకాని, తిరిగి మరల సజావుగా జీవితాన్ని కొనసాగించే సమయం కూడా ఉంది.[40] బాధపడే సమయం ఉంది. అయితే స్వీయ సానుభూతిని చూపించుకొని చీకటి గదుల్లో కూర్చునే సమయాన్ని విడిచి, ఇతరుల బాధను మాన్పే పని చేయవలసియుంటుంది.

## అతడు సమాధానపరచడానికి ప్రయత్నించాడు (19:8బి-20:26)

తిరుగుబాటు కొద్ది వారాలే కొనసాగింది. త్వరలోనే అంతః కలహం ముగిసిపోయింది. అయినా అంతా మునుపటివలె ఉండిపోయిందని దాని అర్థం కాదు. ఆదిలోని కలవరం కంటె తరువాత ఏర్పడే విభజనే విడగొట్టడానికి ఎక్కువ బలమైనదిగా ఉంటుంది. 19వ అధ్యాయం చివరి భాగంలో, దేశంలో శాంతిని పునరుద్ధరించి గతాన్ని నేపథ్యంలో ఉంచడానికి ఆదర్శంగా నిలిచాడు.

దావీదు యెరూషలేముకు తిరిగి రాకుండ ఉంటే బాగుండేదని కొందరు రచయితలు, వ్యాఖ్యానకర్తలు అభిప్రాయపడ్డారు. మూడు సంగతులు మనస్సులో ఉంచుకోవాలి: (1) దావీదు యింకా పరధ్యానంలో ఉండి బాధ, దోషారోపణలతో నిండివున్నాడు. (2) దావీదు అప్పటికి అప్పుడే కొన్ని నిర్ణయాలు చేయవలసిన పరిస్థితిలో ఉన్నాడు; అలా చేయడం అంత సులభం కాదు. (3) రచ్చ జరిగిన తరువాత అయిన గందరగోళాన్ని సరిచేసే ప్రయత్నంలో విజయం సాధించగల పరిస్థితి తక్కువగా ఉంటుంది. విషయాలన్నీ ఆలోచిస్తే, సమాధానాన్ని నెలకొల్పాలనే అతని ప్రయత్నం పరిచితమైనదే.

18:16, 17 ఎక్కడ విడిచిపెడుతుందో, 19:8 చివరి భాగం అక్కడనుండి కొనసాగుతుంది. ఓడిపోయిన ఇశ్రాయేలీయులు యింటికి తిరిగి వచ్చినప్పుడు, వారి తప్పును వారు జ్ఞాపకం చేసికొన్నారు: అబ్షాలోమును వారు రాజుగా అభిషేకించిన దినాన – తమ శత్రువులను ఓడించింది దావీదని, వారి ఐశ్వర్యాభివృద్ధికి దావీదు కారణమన్న విషయాన్ని వారు మరచి ఆ పనిని జరిగించారు 10వ వచనం చివరి భాగంలో వారి మాటలు ఆసక్తికరంగా ఉన్నాయి: "కాబట్టి మనము రాజును మరల తోడుకొని వచ్చుటను గూర్చి మౌనంగా ఉన్నామెందుకు?" వారి మాట నీకు వినిపించడం లేదా?

"అది నా తప్పుకాదు మనం ఆ గందరగోళంలో ఉన్నాం. అది నీ తప్పు!"

"నీవు తమాషాగా మాట్లాడుతున్నావు. నేను నిన్ను అబ్షాలోమును రాజుగా చేసిన

చోట చూచాను!"

"కుతూహలంగా ఉన్నందుకే నేను అక్కడికి వచ్చాను. నిజంగా నేను దానికి వ్యతిరేకంగానే ఉన్నాను!"

"తప్పక నీవు అక్కడ ఉన్నావ్! ఇప్పుడు మనకు రాజు లేడు – సులభంగా మనం ఫిలిష్తీయులకు ఆహారమౌతాం. దావీదును తిరిగి రమ్మని అడగడానికి ఎవరైనా ఒకడు కావాలి."

"సరే, నీవు ఆ పని చేయ్."

"లేదు, నీవు చేయ్."

ఉత్తరమందున్న గోత్రాలవారు ఏమనుకుంటున్నారో – ఆ సమాచారం దావీదు చెవికి తాకింది. ఏదియెలాగున్నా, యూదా గోత్రం అభిప్రాయాన్ని గూర్చి దావీదు ఎక్కువ శ్రద్ధ కలిగియున్నాడు. తిరుగుబాటు యూదాలోని హెబ్రోనులోనే తారా స్థాయికి చేరుకుంది. అబ్షాలోము; అతని సలహాదారుడైన అహీతోపెలు; అతని సైన్యాధిపతియైన అమాశావంటి ప్రధాన పాత్రధారులంతా యూదాకు చెందినవారే తాను తిరిగి వచ్చుటకు ఆహ్వానించడంలో యూదా నాయకులు ముందంజ వేయునట్టు దావీదు సాదోకు అబ్యాతారులకు వర్తమానం పంపాడు. అందునుబట్టి, తమ తిరుగుబాటును దావీదు తన మనస్సులో ఉంచుకోనన్నట్టు అక్కడ నాయకులకు తెలిసేలా చేశాడు.

తరువాత, యోవాబుకు మారుగా దావీదు అమాశాను సైన్యాధిపతిగా నియమించాడు.[41] రాజద్రోహం జరిగించినందుకు అమాశా తీర్పు తీర్చబడి మరణదండన విధింపబడవలసినవాడే, కాని దావీదు కనికరించి వానిని క్షమించాడు. అతన్ని సైన్యాధిపతిగా చేయడంవలన తన స్నేహపు హస్తాన్ని యిటు యూదాకును (అమాశా ఈ గోత్రికుడు గనుక) అటు ఇశ్రాయేలీయులందరికిని (అతడు వారి సైన్యాన్ని నడిపించాడు గనుక) అందజేసాడు.

దావీదు బాధింపబడిన పక్షంవాడైనా, – మనమందరం అనుసరించవలసిన మాదిరిగా – బాధించినవారిలో బాంధవ్యాన్ని పునరుద్ధరించుకొనడంలో దావీదు ముందుకు వచ్చాడు. శిక్షించడంలోని ఉద్దేశాలలో ఒకటి పరీక్షించడం అనే విషయాన్ని జ్ఞాపకం చేసికో. ఆ పరీక్షలలో క్షమించే హృదయాలు మనకు ఉన్నవో లేవో చూడడం ఒకటైయుంది.[42]

దావీదు యొక్క చర్యలు యూదాలోనున్న వారిని ఆనందింపజేశాయి. వారందరు కలసి ఏక కంఠంతో, "–నీవును నీ సేవకులందరును మరల రావలెనన్న వర్తమానము వారు రాజునొద్దకు పంపిరి" (19:14).

దావీదూ, అతని కుటుంబమూ, స్నేహితులును తిరిగి యెరూషలేము వెళ్లసాగారు. దావీదుతో గిలాదువాడైన బర్జిల్లయి ఉన్నాడు. మహనయీమునుండి దావీదుకు అవసరమైన వస్తువులను తెచ్చినవాడితడే.[43] దావీదు అతనిపట్ల కృతజ్ఞతతో నిండి ఉన్నాడు. వారు యొర్దాను నదిని సమీపించినప్పుడు, ఆ వృద్ధుని తనతో కూడా యెరూషలేమునకు రమ్మని దావీదు కోరాడు. రాజనగరు జీవితానికి సంబంధించిన ఉల్లాసాలు, వసతులు తాను అనుభవించలేనని బర్జిలయి ఉత్తరమిచ్చాడు. అయితే, రాజుకు తన కుమారుని చూపించి[44]

బర్జిలయి యిలా అన్నాడు: “నీ దాసుడగు కింహాము నా యేలినవాడవును రాజువునగు నీతోకూడ వచ్చుటకు సెలవిమ్ము; నీ దృష్టికి ఏది యనుకూలమో దానిని అతనికి చేయుమని” మనవి చేశాడు (19:37). ఆ ఏర్పాటుకు దావీదు అంగీకరించి, ఆ వృద్ధ స్నేహితుని దావీదు కౌగలించుకొని అతని దీవించాడు. కష్టకాలంలో నీకు సహాయం చేసినవారిని మరచిపోవద్దు!

దావీదు యొర్దానును సమీపింపగా, యూదానుండి ఉన్నట్టుండి ఏర్పడిన ఒక సంభవాన్ని ఎదుర్కొన్నాడు. రాజును యింటికి ఆహ్వానించడానికి చాలా మంది జనులు గుంపుగా ఎదురుపడ్డారు. రాజు వారి కనుమేరకు రాగా – వారు వేసే కేకల ధ్వని నేను వింటున్నాను – ఆ రాత్రివేళ దావీదు దొంగచాటుగా వెళ్లినదానికిని దీనికిని ఎంతటి వ్యత్యాసముందో!

తమయందు తమకే అక్కర కలిగియున్నవారిని కూడా దావీదు కలిసికొన్నాడు. ఆ సంతోషకరమైన ఉత్సవంలో తాము మేలు పొందగోరారు. సీబా అక్కడ ఉన్నాడు. దావీదు యెరూషలేమునకు తిరిగి రావడం విషయంలో అతడు ఆందోళనగా ఉన్నాడు. ఎందుకంటె మెఫీబోషెతు విషయంలో అతడు అబద్ధం చెప్పాడు, ఆ విషయం మెఫీబోషెతు నోట దావీదు నేరుగా వినబోతాడు. అందునుబట్టి దావీదును రుణస్థునిగా చేసి ఆ సంకటంనుండి తప్పించుకొనడానికి గాను, దావీదును అతని యింటివారిని సీబాయు అతని కుమారులును సేవకులును యొర్దాను నదిని దాటించారు.[45]

షిమీ అక్కడున్నాడు – రాజు యెరూషలేము విడిచి వెళ్లే సమయంలో రాజైన దావీదుపై రాళ్లు రువ్వుచూ దూషించిన వెర్రివాడు షిమీ. దావీదు తిరిగి రాజధాని నగరునకు వచ్చిన సంగతిని వినినప్పుడు అతడు భయాక్రాంతుడైన సంగతి నీకు తెలుసా? రాజు యొర్దాను నది దాటిపోగానే షిమీ వచ్చి సాష్టాంగపడ్డాడు. “నేను పాపము చేసితినని నాకు తెలిసినది” అని అతడు ఒప్పుకొని కనికరము కొరకు మనవి చేసికొన్నాడు (19:20).[46] బెన్యామీను గోత్రంనుండి వెయ్యిమంది అతని వెంటవచ్చారు. షిమీ వారివైపు తన చెయ్యి ఆడిస్తూ, “ఇంటికి నిన్ను ఆహ్వానించే ఉత్తర గోత్రీకులలో మమ్మును మొదటివారిగా భావించు”మన్నట్టు అతడు చెప్పాడు.[47]

మామూలుగానే, అక్కడికక్కడే షిమీని చంపవలెనని అబీషై సిద్ధంగా ఉన్నాడు. ప్రతి సమస్యకు ఒకే పరిష్కారం అబీషైకి ఉంది. (అతడు గొప్ప సైనికుడేగాని, అతన్ని నీ పొరుగువాడైయుండ నీవు యిష్టపడవు). “ఇది సంతోషించే దినమేగాని రక్తాన్ని ఒలికించే దినం కాదు” అన్నట్టు దావీదు అన్నాడు. “నీకు మరణ శిక్ష విధింపబడదు” అని తన కాళ్లమీద దోగాడే మనిషితో అతడన్నాడు (19:23).[48]

యొర్దానునుండి దావీదును అతనితో కూడ ఉన్నవారును యెరూషలేమునకు పయనించారు. తన మార్గంలో గొప్ప జన సమూహాలు బారులు తీరి ఉంటారనేది నిస్సందేహం – అతడు వెళ్లుతూ ఉండగా కేకలు వేస్తూ, ఆనందంతో జయధ్వనులు చేస్తూ ఉంటారు.

రాజు యెరూషలేము సమీపిస్తుండగా, మెఫీబోషెతు అతని కలిసికొన్నాడు. ఆ యువకుడు ఆశ్రయం లేనివాడుగా కన్పించాడు. “రాజు పారిపోయిన దినము మొదలుకొని

అతడు సుఖముగా తిరిగి వచ్చిన నాటివరకు అతడు కాళ్లు కడుగుకొనకయు, గడ్డము కత్తిరించుకొనకయు బట్టలు ఉదుకుకొనకయు నుండెను" (19:24). ఇది మెఫీబోషెతు చెప్పుకున్న సంగతులు కావు. ఇది నిజంగా జరిగినట్టు ఆత్మ ప్రేరేపణా లేఖికుడు వివరించిన సంగతులే. సింహాసనాన్ని కబళించాలనే పన్నాగంలో ఉన్నవాని పని అలా ఉండదు. రాజును తనకు స్నేహితుడునైనవాడు పారిపోగా హృదయం నలిగిపోయినవానినే ఈ దృశ్యం సూచిస్తుంది.

మెఫీబోషెతు దర్శనం అతని గూర్చి సీబా చెప్పిన కథను గురించి దావీదుకు మరో రకమైన ఆలోచనలను కలిగించాయి. "–మెఫీబోషెతూ, నీవు నాతో కూడ రాకపోతివేమని అతని నడిగెను" (19:25). అతని ప్రత్యుత్తరం హృదయపు నాడులను మీటినట్టు విన్పిస్తుంది:

> నా యేలినవాడా రాజా, నీ దాసుడనైన నేను కుంటివాడను గనుక గాడిదమీద గంత కట్టించి యెక్కి రాజుతోకూడ వెళ్లిపోదునని నేననుకొనగా నా పనివాడు నన్ను మోసము చేసెను. సీబా నీ దాసుడనైన నన్నుగూర్చి నా యేలినవాడవును రాజువునగు నీతో అబద్ధమాడెను. అయితే ... నీవు దేవదూత వంటివాడవు, నీ దృష్టికి ఏదియనుకూలమో దాని చేయుము. నా తండ్రి యింటివారందరు ... నీ దృష్టికి మృతులవంటివారై యుండగా, నీవు నీ బల్లవద్ద భోజనము చేయువారిలో నీ దాసుడనైన నన్ను చేర్చితివి. కాబట్టి ఇకను రాజవైన నీకు మొఱ్ఱపెట్టుటకు నాకేమి న్యాయము ... (19:26-28).

"ఇప్పుడు నేనేమి చేయాలి?" అని దావీదు ఆలోచిస్తున్నట్టున్నాడు. "నీవును సీబాయును భూమిని పంచుకొనుడని నేనాజ్ఞ ఇచ్చితిని గదా అనెను" (19:29). అది పరిపూర్ణమైన పరిష్కారం కాదు. జరిగిన నష్టాన్ని సరిచేయడానికి అది సరియైన మార్గం కాదు. అందుకు మెఫీబోషెతు – "నా యేలినవాడవగు నీవు నీ నగరికి తిరిగి క్షేమముగా వచ్చియున్నావు గనుక అతడు అంతయు తీసికొనవచ్చును" అని బహు సంతోషంగా చెప్పాడు. – "అతన్ని అంతా తీసికొననిమ్ము నీవుంటే నాకు అంతే చాలు" అన్నట్టు మెఫీబోషెతు అన్నాడు (19:30).

కఠిన పరీక్ష జరిగిన అనంతరం, తొందరపడి నీవు కొన్ని మాటలు పలికినట్టు గుర్తిస్తావు. –అందులో యితరుల (ఫీలింగ్స్) మనో భావాలను గాయపరచడం, లేక చెడ్డ తీర్పులు చేయడంవంటివి గుర్తిస్తావు. అలా జరిగినట్టయితే, మరో తరుణం యివ్వబడి నందుకు, విషయాలు దిద్దుకునే అవకాశం యివ్వబడినందుకు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించు. నీ ట్యూబులోనికి టూత్ పేస్ట్ తిరిగి వచ్చినట్టే, ఈసారి నీకు చేతనైనంత శ్రేష్ఠంగా కార్యాలను నిర్వహించు. నీ ప్రయాసలను అభినందించే మెఫీబోషెతుతో కూడా దేవుడు ఒకవేళ నిన్నుకూడా దీవించునేమో!

## సమస్యలు అంతరించవు (19:40-20:26)

తాను చేయగలిగినంతవరకు సమాధానాన్ని చేకూర్చి, బాంధవ్యాలు సరిచేసిన మీదట దావీదు పట్టణంలోనికి చేరుకున్నాడు. అక్కడ జనానికి చేయి ఊపుతూ, దావీదు ఇలా

తలచి ఉంటాడని ఊహిస్తాను, “మనం దీనిని వెనకకు నెట్టి సమస్తాన్ని బాగుచేసే మార్గం మొదలు పెట్టాలి.”

అది అలాగున జరుగకూడదు. కాని దావీదు సింహాసనం మీద తిరిగి కూర్చున్నతోడనే – ఉత్తరపు గోత్రాలనుండియు, యూదా గోత్రంనుండియు ప్రతినిధులు తనచుట్టు గుమికూడి రాజు తిరిగి రావడంతో తమకు న్యాయం జరుగలేదని గుద్దులాడ మొదలుపెట్టారు. రాజు మెడకు ఒక గుంపు తిరుగటి రాయి కట్టింది; మరియొక గుంపు అతనిని నడి సముద్రంలో పడవేసింది. అతన్ని అడుగునకు కొనిపోయే హక్కు ఎవరికి ఉందో అంటూ వ్యర్థంగా జగడమాడుతున్నారు!

దావీదు శ్రమలకు తోడు, ఉత్తరపు గోత్రాలవారి మధ్య రేగిన అసంతృప్తికి ఫలితంగా “షెబ అను ఒక పనికిమాలినవాడు తిరుగుబాటుకు లేపాడు” (20:1). ఈ తిరుగుబాటును అణచడంలో, దావీదు సైన్యంలో తాను పోగొట్టుకొనిన సైన్యాధిపతి పదవిని దక్కించుకొనడానికిగాను యోవాబు అమాశాను హత్యచేశాడు![51]

దావీదు నిట్టూర్పు విడిచి ఆకాశము తట్టు కన్నులెత్తి, “దేవా నాకు బలమునిమ్ము” అని ప్రార్థించినట్టు నేను చూస్తున్నాను.

## అతడు యెహోవాపై ఆనుకొన్నాడు

ఈ పాఠాన్ని మనం ముగించబోతూ ఉండగా, “ముందుకు సాగడానికి దావీదుకు బలం ఎలా వచ్చిందో” మనం అడగవలసియుంటుంది. యెహోవా అతనికి తోడుగా ఉన్నాడనేదే జవాబు.[52] కీర్తనలు 3, 4లకు ముందున్న నోట్సును చూడు. ఇవి దావీదుయొక్క విలాపములు, సాయంకాలపు ప్రార్థనలైయున్నాయి. – “తన కుమారుడైన అబ్షాలోమునుండి పారిపోయినప్పుడు” – రెండు కీర్తనలు యిలాగే ఆరంభమౌతాయి:

> యెహోవా, నన్ను బాధించువారు ఎంతో విస్తరించి యున్నారు
> నామీదికి లేచువారు అనేకులు.
> – దేవునివలన అతనికి రక్షణ యేమియు దొరకదని
> నన్నుగూర్చి చెప్పువారు అనేకులు.
> యెహోవా, నీవే నాకు కేడెముగాను
> నీవే నాకు అతిశయాస్పదముగాను
> నా తల ఎత్తువాడవుగాను ఉన్నావు (కీర్తన. 3:1-4).

అదే భావంతో అవి ముగించబడతాయి:

> యెహోవా, నీ సన్నిధికాంతి మామీద ప్రకాశింపజేయుము.
> వారి ధాన్య ద్రాక్షారసములు విస్తరించిననాటి సంతోషముకంటె
> అధికమైన సంతోషము నీవు నా హృదయములో పుట్టించితివి.
> యెహోవా, నెమ్మదితో పండుకొని నిద్రపోవుదును
> నేను ఒంటరిగా నుండినను నీవే నన్ను సురక్షితముగా
> నివసింపజేయుదువు (4:6-8).

బాధలు మన మార్గాన వచ్చినప్పుడు, దేవునికి విరోధంగా మనం గుద్దులాటకు

దిగవచ్చు లేదా ప్రార్థన, విజ్ఞాపన, స్తుతితో దేవుని కలుసుకోవచ్చు. దావీదు రెండవదానిని జరిగించాడు. అతడు దేవుని ఆశ్రయించినందున కలవరం చెందే సమయాల్లో అతడు సాగిపోగలిగాడు.

## ముగింపు

ఈ పాఠం జరుగుతూ ఉండగా, దేవుని శిక్షను సంతోషంతో ఎలా అంగీకరించాలో పలు సలహాలను సూచిస్తూ వచ్చాను. వాటిలో యివి ఉన్నాయి.

నీ భవిష్యత్తును దేవుని చేతుల్లో ఉంచి, ఆయనను నమ్ముకో. ఆయన నిన్ను శిక్షించినప్పుడు సయితము నిన్ను విడువడు.

దేవునితోను యితరులతోను నీ బాంధవ్యాలను బలపరచుకొంటూ, భవిష్యత్ సమస్యలను ఎదుర్కొనడానికి సిద్ధపడియుండు.

నీకు సహాయపడిన స్నేహితుల విషయంలో దేవునికి స్తుతి చెల్లించు – వారిని మరచిపోకు.

పాపకూపములో నీవు చిక్కుబడియున్నప్పుడు నీ తెలివితేటలకు వచ్చేవరకు నిన్ను దిగ్భ్రమపరచిన స్నేహితులకొరకు కూడా దేవుని స్తుతించు.

నీ ఉద్వేగాలను వ్యక్తపరచడానికి భయపడకు. అయితే నీకు నీవే సానుభూతిని కనుపరచుకొనడంలో మునిగిపోకు.

నీలోనుండి నీవు వెలుపలికి వచ్చి, యితరుల యొక్క అవసరతలమీద దృష్టి నిలుపు. ప్రత్యేకించి నీకు జరిగినదానిని బట్టి బాధింపబడినవారికి దానికనుపరచు.

స్పష్టంగా ఆలోచింపగల నీ శక్తిని బాధ మొద్దుబారచేయగలదు. నీకంటే తేటగా పరిస్థితిని చూడగలవారి సలహా వినడానికి సిద్ధంగా ఉండు.

నీవు తిరిగి స్పష్టంగా ఆలోచింపగలిగినప్పుడు, కొన్ని తప్పు తీర్మానాలు చేసినట్లు నీకు కన్పించినట్లయితే వాటిని అంగీకరించడానికిని దిద్దుబాటు చేసికొనడానికిని వెనుకాడకు.

శిక్షింపబడుతున్నప్పుడు బలహీనపడే అవకాశాలను గూర్చి జాగ్రత్తపడు. ఒకవైపు, అది అవకాశంగా తీసికోబడనియ్యకుండ చూచుకో, మరోవైపు దెబ్బకు దెబ్బ కొట్టాలనే శోధనను ప్రతిఘటించు.

శిక్షలో ఒక భాగం మనలను పరీక్షించడమన్న సంగతి జ్ఞాపకముంచుకో – మనం ఆ పరీక్షను తట్టుకొంటే శ్రేష్ఠమైన ప్రజలమైయుంటాం.

అన్నిటికంటె మనలను అత్యధికంగా ఒప్పించింది – దావీదు యొక్క వైఖరి, స్వభావం. దావీదు మాటలను మరోసారి గమనించు: "... యెహోవా దృష్టికి నేను అనుగ్రహము పొందినయెడల ఆయన నన్ను తిరిగి రప్పించి దానిని, తన నివాసస్థానమును నాకు చూపించును; నీయందు నాకిష్టము లేదని ఆయన సెలవిచ్చినయెడల ఆయన చిత్తము, – నీ దృష్టికి అనుకూలమైనట్టు నాయెడల జరిగించుమని నేను చెప్పెదను" (15:25, 26). ఇంతకు దావీదు చెప్పిందేమంటే – "నన్ను నేను దేవుని చేతుల్లో పెట్టుకుంటా,

ఆయన తనకు యిష్టం వచ్చినట్టు నాయెడల జరిగించునుగాక. మేలైనది జరిగిస్తాడని నేను ఆయనను నమ్ముకుంటా."[53]

"దేవా, సమస్యలు మా జీవితాల్లోనికి వరదవలె పొర్లి వచ్చినప్పుడు, నీ సేవకుడైన దావీదు కనుపరచిన స్వభావాన్ని మాకు ప్రసాదించండి. మీరు మమ్మును ద్వేషించి కాదని, కేవలం ప్రేమించియేనని గ్రహించడానికి మాకు సహాయము ప్రసాదించండి. తండ్రీ, మీరు మాకొరకు చేసేదాన్ని అనేక సార్లు ప్రతిఘటించినవారము. మీ శిక్షను సంతోషంతో అంగీకరింప సహాయం చేయండి. – యేసు నామమున, ఆమెన్."

---

## ప్రసంగపు నోట్సు

అబ్షాలోముతో జరిగే యుద్ధ సమయంలో – దావీదు సేవకులు అతని పట్టణంలోనే నిలిచియుండుమని అతని అడుగుతారు. పని విరమణ అనే అంశం మీద ప్రసంగానికి అది మంచి సమయమైయుండవచ్చు: "సారథ్యాన్ని యితరులకు అప్పగించడం" అనే పేరుతో దాన్ని చర్చించవచ్చు.

పాఠంలో గమనించినట్టే, కీర్తన. 3 మరియు 4లు – అబ్షాలోమునుండి దావీదు పారిపోయినప్పుడు, అతడు చేసిన "ఉదయ, సాయంకాలపు ప్రార్థనలు." కీర్తన 41 అహీతోపెలు దావీదునకు వ్యతిరేకంగా తిరుగుటను సూచింపవచ్చు. ప్రత్యేకించి, 9వ వచనాన్ని గమనించు. (యోహాను 13:18లో, అది యిస్కరియోతు యూదా ప్రభువునకు విరోధంగా తిరిగిన దానికి సూచింపబడింది.) దావీదు యొర్దాను నదిని దాటినప్పుడు 42, 43 కీర్తనలు వ్రాయబడినట్టు చెప్పబడింది. 61, 62లో మహనయీములో ఉన్నప్పుడు వ్రాయబడినట్టు సూచింపబడ్డాయి. ఈ కాలంలో వ్రాయబడ్డాయని చెప్పబడిన కీర్తనలలో 7, 20, 23, 27, 37, 38, 40లు చేర్చబడ్డాయి.

---

సూచనలు

[1]2 సమూ. 15:18లోని ఆరువందల మంది ఇత్తయితో వచ్చినవారో, లేక అరణ్యంలో దావీదుతో ముందుగానే ఉన్నవారో తేటగా లేదు. రెండవది నిజమని నా అభిప్రాయం. ఇత్తయితోనున్న మనుష్యులను గూర్చి ఆ క్రింది వచనాలు మాట్లాడినందునను, తరువాత దావీదు ఇత్తయిని మూడవ సేనానాయకునిగా చేసిన కారణాన, ఇత్తయితో పెక్కుమంది జనులు ఉండియుండవచ్చు. [2]యెరూషలేములో వారి నివాస స్థలాలను ఇది సూచిస్తుంది. [3]"అబ్యాతారు వచ్చి జనులందరును దాటిపోవువరకు బలులు అర్పించుచుండెను" అని NIV అంది (2 సమూ. 15:24). [4]"దీర్ఘదర్శియని" దావీదు సాదోకును పిలిచాడు (2 సమూ. 15:27). యూరీము, తుమ్మీములు కలిగియున్న ఏఫోదును ఉపయోగించి యెహోవా యొద్ద విచారణ చేసేవాడని సూచించడానికి దావీదు అతని అలా పిలిచియుండవచ్చు. ఏమి సంభవిస్తుందో కనుగొనే స్థితిలో సాదోకు ఉన్నట్టున్నాడు. [5]"అరణ్యమందలి రేవుల దగ్గర నిలిచియుందు"నని దావీదు అన్నాడు (2 సమూ. 15:28) అది యాజకులకు ఎరుకైన స్థలం యొర్దానులో లోతు తక్కువైన స్థలమై యుండవచ్చు. [6]2 సమూ. 15:32 యిలా అంటుంది: "దేవుని ఆరాధించు స్థలమొకటి కొండమీద ఉండెను" దేవుని ఆరాధించడానికి దావీదు అక్కడ నిలిచాడని అర్థం కావచ్చు. లేక దేవుడు ఏ స్థలంలో ఆరాధింపబడతాడో అది ఉన్నత స్థలమనబడేది. దేవాలయ నిర్మాణానంతరం ఉన్నత స్థలాలు తొలిగింపబడాలి (అయితే రాజుల్లో అనేకులు వాటిని తొలిగించలేదు). [7]అర్కీయులు బేతేలుకు నైఋతిగానున్న ఒక తెగవారు (యెహోషువ 16:2). [8]2 సమూ. 16:17 చూడు. దావీదుతో హూషైకి ఉన్న బాంధవ్యపు వర్ణన అనకుండ అనేకమంది

పండితులు దానిని ఒక బిరుదుగా భావిస్తారు (1 రాజులు 4:5ను గమనించు.) దావీదు ఆస్థానంలో హూషై ఆక్రమించుకున్న స్థానమేదైయున్నా, దావీదు యొక్క స్నేహితుడైయున్న స్థితినుండి అది అతని తొలగించదు. హూషై దావీదుకు చేసిన సేవకు వ్యక్తిగతమైన స్నేహమే అవసరమైయుండవచ్చు. [9]దావీదు యొక్క జీవితంలోని గాథలలో యిది ఎక్కువ అబద్ధంతో కూడిన ఒక కథయైయుండవచ్చు. ఒక సంఘటనను బైబిలు దాఖలు చేసినంత మాత్రాన దానిని దేవుడు అంగీకరించాడని అర్థం కాదని నేను మరోసారి జ్ఞాపకం చేస్తున్నా. బైబిలు పాత్రలు జరిగించిన ప్రతిదానిని మనం రైటని రుజువు చేయనక్కరలేదు – అది దావీదే కావచ్చు అతని స్నేహితులే కావచ్చు. తప్పు ఎవరు చేసినా తప్పే. [10]ప్రసంగి 4:9, 10, 12.

[11]నీ శ్రోతలు గుర్తించగల ఒక ఉదాహరణను ఉపయోగించు. 50లలో Judsonia, Arkansas పూర్తిగా తుఫానులో కొట్టుకుని పోయాయి. [12]మెఫీబోషెతు దావీదు యొక్క బల్లవద్ద భోజనం చేయువాడు గనుక, దావీదు పట్టణాన్ని విడిచిపోయే సమయంలో అతనికి ఆ సమాచారం అందింపబడియుండవచ్చు. [13]వార్తలు పూర్ణంగా ఉదాహరణలతో నిండి ఉన్నాయి. ప్రత్యేకించి ఎవరైతే ముసలివారికొరకు బలహీనులకొరకు ప్రార్థిస్తారో వారి గురించి, మోసగాళ్లైన వ్యాపారులు ముసలివాళ్లకు ఉచ్చు వేస్తారు? మోసగాళ్లైన దాతలు విధవరాండ్ర విల్లులను వాళ్ళ పేరుకు మార్చుకుంటారు. [14]హెబ్రీ. 12:10; యాకోబు 1:2-4. [15]బహిర్గతంగా ఆకీషు అను ఫిలిష్తీయుల రాజుకు దావీదు చేరువైనందున, సౌలు, అతని కుమారులు మృతి చెందడానికి దావీదు కారకుడైయుంటాడని షిమీ నమ్మియుండవచ్చు. లేదా ఇష్బోషెతు మరణానికి దావీదు కారణమైయుంటాడని అతడు దావీదుపై నిందమోపియుండవచ్చు. లేదా, 2 సమూ. 21:1-14లోని సంఘటనలు ముందుగా జరిగియుంటే, ఒకవేళ ఆ సంగతులు షిమీ మనస్సులో ఉండియుండవచ్చు. [16]దావీదు ప్రతిపాదనకు ముందు – సెరూయా కుమారులారా, మీకును నాకును ఏమి పొందు? అని అతడు ఉపయోగించాడు (2 సమూ. 16:10). సెరూయా దావీదు యొక్క సహోదరి. “సెరూయా కుమారులు” యోవాబు, అబీషై అనువారు. యోవాబు దావీదుతో కూడ ఉన్నవాడు (2 సమూ. 18:2). “మీకును నాకును ఏమి పొందు?” అని అంటే, మనం విషయాలను ఒకే విధంగా చూడలేకున్నామని భావం. [17]అబ్షాలోము కుట్రయొక్క విజయం 2 సమూ. 17:4లో కన్పిస్తుంది. “ఇశ్రాయేలు పెద్దలందరును” అతనితో ఉన్నట్టు అది సూచిస్తుంది. “ఇశ్రాయేలు” అనగానే కేవలం ఉత్తరపు పది గోత్రాలను సూచించడానికి బదులు, ఇశ్రాయేలీయులందరును సూచించి యుండవచ్చు. [18]“మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును” అనే పాఠంలో అహీతోపెలును గూర్చి చూడు. [19]అహీతోపెలు దావీదును “రాజు” అని సూచించాడు; సింహాసనంపై ఎవరు ఉండాలో పాత మంత్రికి తెలిసియుండాలి. [20]అది దేవుని ధర్మశాస్త్రానికి విరోధమైనది (లేవీయ. 20:11; 1 కొరింథీ. 5:1 కూడా చూడు).

[21]2 సమూ. 17:14 “యుక్తమైన ఆలోచన” – అబ్షాలోము పక్షంగా మంచిదని. [22]సైన్య వ్యవహారాలలో మనకు తెలిసినంతవరకు, అబ్షాలోముకు ఎక్కువ అనుభవం లేదు. యుద్ధంలో అబ్షాలోముకు శిరస్త్రాణంగాని, చేత ఖడ్గంగాని ధరించినట్టు లేదు. తనకు అపజయం కలగడానికి హూషై అబ్షాలోము యొక్క వ్యర్థతకు విన్నవించుకున్నాడు. [23]బైబిల్లో దాఖలు చేసిన నాల్గు ఆత్మ హత్యలలో యిదొకటి. అహీతోపెలు తన్ను తాను చంపుకొన్నది ఎందుకంటే – తన సలహా పాటించనప్పుడు, అబ్షాలోము యొక్క ఓటమి ఖాయం. తదుపరి దావీదు తన్ను ఏమి చేయబోతాడో భయపడి అలా చేసికొన్నట్టు చెప్పబడింది. అతడు ఉరిపోసుకొని చనిపోయెను. [24]దావీదుకు వర్తమానం పంపడానికి చక్కటి ఏర్పాటే రూపించబడింది (2 సమూ. 15:34-36). పట్టణంలోనికి ప్రవేశించుతూ బయటికి వెళ్లుతుంటే, అనుమానం వస్తుందని అతని యిద్దరు కుమారులు ప్రాకారానికి వెలుపటే నిలిచారు (2 సమూ. 17:17). కిద్రోను వాగు సమీపంలో ఉన్న నీటి ఊటవద్ద వారున్నారు. నీటి ఊటవద్ద నీళ్లు తెచ్చుకొనబోయే పనిపిల్ల ఎవరి దృష్టిని ఆకర్షించదు. [25]ఇద్దరు వేగులవారిని దాచిన రాహాబు కథలా, యిది కూడా అలా ఆసక్తికరమైన సంఘటనయే. [26]నీవు యిక్కడ ఆగి యౌవనుల కొరకు ఒక పాటను నడిపింపవచ్చు. [27]వీరిలో ఒక సైన్యాధిపతి గిలాదువాడైన ఇత్తయి కావచ్చు. దావీదు పట్ల నమ్మకత్వము మంచిగా ప్రతిఫలం పొందింది. [28]దావీదు యొక్క సైన్యం కేవలం నాలుగువేల మందితో కూడిందని జోసీఫస్ అంటాడు – కావచ్చు. [29]2 సమూ. 17:24-26. అబ్షాలోము అమాశాను తన సైన్యంపైనుంచాడు. అమాశా దావీదు యొక్క మేనల్లుడా? అబ్షాలోముకు బంధువే. [30]రాజును బంధించడమే అతి ప్రాముఖ్యం. రాజును కాపాడుకొనడానికి ఎందరు చనిపోయినా పెద్ద సమస్య లేదు. పరపక్షపు రాజును బంధించాలి. అదే యిక్కడ కావలసింది.

[31]రాజును కాపాడడానికి గాని, సహాయం కావలసి వస్తే పరుగెత్తడానికి గాని దావీదుతో కొద్దిమంది సైనికుల కూటమే పట్టణంలో నిలిచియున్నట్టున్నారు. [32]అబ్షాలోము యొక్క సిద్ధపాటు లేని సమయాన్ని పురస్కరించుకొని వారు అడవులలోనికి పారిపోయేలా వింతగా వారిమీద పడేలా దావీదు ఒక తంత్రాన్ని పన్నినట్టు జోసీఫస్ వ్రాశాడు. [33]యుద్ధం గిలాదులో జరిగినప్పటికి, ఆ అడవి మాత్రం “ఎఫ్రాయిము అరణ్యం” అని పిలువబడింది (17:26). అది యొర్దానుకు తూర్పు ప్రాంతం – ఎఫ్రాయిము యొర్దానుకు పశ్చిమంగా ఉంది, వృక్షజాలాన్ని అక్కడ, “ఎఫ్రాయిము అరణ్యమని”

వ్యవహరించబడినట్టు చెప్పబడింది. 42, 000 మంది ఎఫ్రాయిమీయుల స్మారక చిహ్నంగా అది అలా పిలువబడినట్టుంది (న్యాయాధి. 12:1-6). [34]"నాటి దినమున కత్తిచేత కూలినవారికంటె ఎక్కువ మంది అడవిలో చిక్కుబడి నాశనమైరి" (2 సమూ. 18:8) - అనేది సైనికులు గోతులలో పడి చచ్చినదానిని సూచిస్తుంది (2 సమూ. 18:17ను గమనించు), అడవి మృగములకు ఆహారమగుట వగైరాలు. [35]అబ్షాలోము సైనికులు ఇరవై వేలమందా లేక అంతా కలిపి ఇరవై వేలమందియా స్పష్టంగా లేదు. అబ్షాలోము సైనికులు ఇరవై వేలమందని నా ఊహ. [36] నైలునది పై భాగం, ఐగుప్తుకు దక్షిణ భాగంన కూషు అనే ప్రాంతం ఉంది. ఇప్పుడు దానిని ఐతియోపీయ, సుడాను అని పిలుస్తారు. [37]యోవాబే అబ్షాలోమును చంపిన సంగతి దావీదుకు తెలియకపోవచ్చు (1 రాజులు 2:5). దావీదుతో అతడు పలికిన మాటలలోని సాహసం - యోవాబు అబ్షాలోమును చంపినట్టు దావీదు ఎరుగడని తెలుస్తుంది. [38]ఇలా చేయడంలో యోవాబు యొక్క ఉద్దేశం - దావీదు పట్ల అక్కరగలవాడై యుండవచ్చు. లేదా దేశంపట్ల అక్కరగలవాడైయుండవచ్చు లేక తన అంతస్థు విషయమైన అక్కర కలిగియుండవచ్చు కూడ. అది ఎలాగున్నా, దావీదుకు అవసరమైన మాటలను అతడు పలికాడు. [39]ప్రజలతో "దయగా" మాట్లాడమని యోవాబు దావీదుకు తెలిపాడు (2 సమూ. 19:7). "ప్రజల హృదయాలతో" మాట్లాడు అన్నట్టు యోవాబు అన్నాడు. అంటే, - వారి హృదయపు అవసరతలలో మాట్లాడు అన్నట్టు అతని సలహా ఉంది. యోవాబు మాటలు వేరుగా చెప్పాలంటే, "సైనికులయొద్దకు వెళ్లి వారిని అభినందించు" అని అన్నాడు. [40]ప్రసంగి 3:4.

[41]తన శరీరంలోని ముల్లును తొలిగించుకొనడానికి దావీదు చేసిన మరియొక కృషి యిది. యోవాబు తన్ను ఎదిరించినట్టు దావీదు విచారించాడా? యోవాబు అబ్షాలోమును చంపిన సంగతి దావీదుకు తెలుసా? తెలిసియుండవచ్చు. (దీనిని యోవాబు యొక్క తప్పుడు పనులుగా దావీదు లెక్కించకపోయినా, 1 రాజులు 2:5). [42]ఎఫెసీ. 4:31, 32. [43]బర్జిల్లయి యొక్క కథ తరువాత దాఖలు చేయబడింది; అయితే దావీదు యొర్దానును దాటక ముందు యిది జరిగింది (2 సమూ. 19:33, 39). ఇది యిక్కడ పెట్టడంలో సంఘటనలను కాలక్రమంలో ఉంచాలని ప్రయత్నించడమే ఉద్దేశం. [44]కింహాము గిలాదీయుడైన బర్జిల్లయి కుమారుడని కొన్ని సెప్టూజెంట్ చేతి ప్రతులలో ఉన్నట్టే జోసీఫస్ రచనలు కూడా తెలుపుతున్నాయి. 1 రాజులు 2:7 దీన్ని బలపరచుతోంది. [45]వారిని పడవలలో దాటించినట్టు యెరూషలేము బైబిలు అంటుంది. [46]బైబిల్లో అట్టి మాటలు పలికిన కొద్ది మందిలో షిమీ ఒకడు. తన కార్యముల యొక్క ప్రతిఫలం రాకుండ తప్పించుకొనడానికి అతడు అలా పలికినట్లు అనిపిస్తుంది. [47]"యోసేపు వారందరు" అనే పదాలను అతడు వినియోగించాడు (2 సమూ. 19:20). యోసేపునుండి రెండు గోత్రాలవారు వచ్చారు - ఎఫ్రాయిాము, మనష్షే అనేవారు ఉత్తర గోత్రాల్లో వీరు చాల పలుకుబడిగలవారు. "యోసేపు వారందరు" అనేది ఉత్తర గోత్రాలన్నిటిని సూచించడానికి ఉపయోగింపబడింది. [48]దావీదు అతన్ని ఎన్నడును నమ్మియున్నట్టులేదు. అతని మరణ పడక మీదనుండి సొలొమోనుకు యిచ్చిన ఆజ్ఞలకు చివరి ప్రతిఫలంగా షిమీ మరణం సంభవించింది (1 రాజులు 2). [49]తప్పు ఒప్పులను విచారించడంలో దావీదు "దేవదూతవంటివాడు" (19:27) దావీదుతో మాట్లాడినప్పుడు తెకొవా స్త్రీ కూడా అలాగే మాట్లాడింది (2 సమూ. 14:17). [50]ఇద్దరు కుమారులు వ్యత్యాసమైన కథలు చెప్పుతున్న తల్లిని పోలి దావీదు ఉన్నాడు. ఒకడు అబద్ధమాడుతున్నట్టు ఆమె ఒప్పింపబడవచ్చు, రుజువు లేనప్పుడు ఆమె యిద్దరిని ఒకేరీతిగా చూస్తుంది.

[51]2 సమూ. 20:23 గమనించు. [52]2 సమూ. 18:28, 31 గమనించు. [53]కీర్తన. 30:4, 5 గమనించు.